కొంగొత్త ఆశలు



ఆర్థిక శాఖ మంత్రిగా పయ్యావుల కేశవ్

- జిల్లాకు దక్కిన అరుదైన అవకాశం
- అభివృద్ధికి దోహదం
- ప్రాజెక్టులు పరుగులు పెట్టేనా..?

అనంతపురం, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆర్థిక, శాసనసభ వ్యవహారాల మంత్రిత్వ శాఖలు పయ్యావుల కేశవ్‌కు దక్కడంతో జిల్లాలో కొంగొత్త ఆశలు చిగురిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వంలో పయ్యావుల కేశవ్ కీలక భూమిక పోషించనున్నారనడంలో సందేహం లేదు. ఆయనకు కీలకమైన ఆర్థిక శాఖను కేటాయించడమే ఇందుకు నిదర్శనం. ఒక్క మాటలో చెప్పాలంటే కరువు జిల్లా అనంతకు దక్కిన అరుదైన అవకాశంగా చెప్పుకోవచ్చు. ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లా చరిత్రలో ఎంతోమంది మంత్రులుగా పని చేసినా జిల్లాకు ఆర్థికశాఖ దక్కలేదు. ఆ అరుదైన అవకాశాన్ని పయ్యావుల కేశవ్ దక్కించుకున్న నేపథ్యంలో జిల్లాలోని అన్ని వర్గాల ప్రజల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. వైసీపీ పాలనలో బటన్ నొక్కుడు తప్ప... ఏ ఒక్క అభివృద్ధికి బీజం పడలేదు. పయ్యావుల కేశవ్‌కు ఆర్థికశాఖ దక్కడంతో జిల్లాలో అభివృద్ధికి బాటలు పడినట్లేనని ప్రజలు గట్టిగా నమ్ముతున్నారు. పడకేసిన, పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులు పరుగులు తీయడం ఖాయమనే అభిప్రాయం ప్రజల్లో వ్యక్తమవుతోంది. వైసీపీ పాలనలో ఏ ఒక్క ప్రాజెక్టుకు గంపెడు మట్టితీసిన పరిస్థితులు లేవు. ఒక ఇటుక రాయి వేసిన పాపానపోలేదు. ప్రధానంగా జిల్లాలో హంద్రీనీవా పూర్తి కాలేదు. హెచ్చెల్సీ ఆధునికీకరణ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. భైరవాన్ తిప్ప, పేరూరు ప్రాజెక్టులకు కృష్ణాజలాలతో నింపాల్సిన అవసరం ఉంది. ప్రతిపక్ష నేత హోదాలో ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రాజెక్టుల సందర్శన సందర్భంలోనూ అనేక హామీలు ఇచ్చారు. హంద్రీనీవాను పూర్తి చేసి డిస్ట్రిబ్యూటరీలు ఏర్పాటు చేసి, పంట పొలాలకు కృష్ణాజలాలు అందిస్తామన్నారు. పేరూరు, భైరవాన్‌తిప్ప ప్రాజెక్టులు పూర్తి చేస్తామన్నారు. రిజర్వాయర్లను నిర్మించి, తాగు, సాగునీటికి ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే... అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోపు జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తామని చంద్రబాబు స్పష్టమైన హామీ ఇచ్చిన విషయం అందరికీ ఎరుకే. చంద్రబాబు మంత్రివర్గంలో కీలకం ఆర్థిక శాఖ. ఆ శాఖ మంత్రిగా పయ్యావుల కేశవ్ జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టుల పూర్తి చేసి కరువు జిల్లా రైతాంగం, ప్రజానీకానికి సాగు, తాగునీరు అందిస్తారనే ఆశల్లో జిల్లా ప్రజానీకం ఉన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు అవసరమైన పరిశ్రమల కోసం నిధుల మంజూరులో పయ్యావుల కేశవ్ కీలకంగా వ్యవహరించే పరిస్థితులు లేకపోలేదు. ఏదేమైనా జిల్లా అభివృద్ధికి మంచి రోజులు రానున్నాయనే అభిప్రాయం అన్నివర్గాల ప్రజల నుంచి వ్యక్తమవుతుండటం గమనార్హం. పయ్యావుల కేశవ్‌కు ప్రభుత్వంలో అత్యంత కీలకమైన ఆర్థిక శాఖను కేటాయించడంతో కూటమి నేతలతోపాటు ఆయాపార్టీల శ్రేణులు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి.



ఆసుపత్రికి గ్రహణం వీడేనా..?

ఐదేళ్లుగా పునాదులకే పరిమితమైన నిర్మాణాలు



ఎంసీహెచ్ బ్లాక్ నిర్మించాలని నిర్ణయించినా ఖాళీ చేయని ఆర్అండ్‌బీ కార్యాలయం

- కలగా మారిన ఎంసీహెచ్ బ్లాక్
- అభివృద్ధి పనులు అస్తవ్యస్తం
- కొత్త ప్రభుత్వంతో చిగురించిన ఆశలు

అనంతపురం టౌన్, జూన్ 14: జిల్లా సర్వజన ఆసుపత్రికి పట్టిన వైసీపీ గ్రహణం వీడుతుందా అనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని జిల్లా సర్వజన ఆసుపత్రి, వైద్యకళాశాలలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన నిర్మాణాలకు రాజకీయ గ్రహణం పట్టడంతో ఐదేళ్లుగా పనులు పునాదులకే పరిమితమయ్యాయి. మరోవైపు మాతాశిశు సంరక్షణకు ఏర్పాటు చేపట్టిన ఎంసీహెచ్ బ్లాక్ వ్యవహారం కలగా మారిపోయింది. దీంతో రోగులకు కష్టాలు వెంటాడుతున్నాయి. ప్రస్తుతం తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ పనులకు పట్టిన గ్రహణం వీడి కష్టాలు తీరుతాయన్న ఆశలు ప్రజల్లో చిగురిస్తున్నాయి. జిల్లా పాలకులు, అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి ఈ అభివృద్ధి పనులు పూర్తి చేయాల్సిన అవసరం ఉంతైనా ఉంది.

● కలగా మారిన ఎంసీహెచ్ బ్లాక్



ఎన్ని ఆరోగ్య పథకాలు పెట్టినా, ఆసుపత్రులలో వసతులు పెంచుతున్నా ప్రసవాలకు వచ్చే సమయంలో మాతాశిశుమరణాలు కొనసాగుతున్నాయి. ప్రధానంగా జిల్లా సర్వజన ఆసుపత్రికి పెద్దఎత్తున గర్భిణీలు ప్రసవాలకు వస్తున్నారు. ప్రతిరోజూ 20 నుంచి 30 ప్రసవాలు ఇక్కడ జరుగుతున్నాయి. కానీ ఆ మేరకు పడకలు లేవు. దీంతో ఒక్కో పడకపై ఇద్దరు, రెండు మంచాలపై ముగ్గురు బాలింతలను ఉంచాల్సిన దుర్భర పరిస్థితులు ఉన్నాయి. ఆ సమయంలో బాలింతలు, నవజాత శిశువులు పడేకష్టాలు వర్ణనాతీతం. ఈ నేపథ్యంలో 2014-19 టీడీపీ ప్రభుత్వ హయాంలో ఈ ఆసుపత్రిలో ప్రత్యేకంగా మాతాశిశు సంరక్షణ విభాగం ఏర్పాటుకు ప్రతిపాదనలు చేసింది. అందుకు అప్పటి టీడీపీ ప్రభుత్వం కేంద్రం దృష్టికి తీసికెళ్లి రూ.300 కోట్లతో ఎంసీహెచ్ బ్లాక్‌తోపాటు సర్జరీ విభాగం ఏర్పాటుకు ఆమోదం తెలిపాయి. 2019లో వైసీపీ అధికారంలోకి రాగా నిధులు కేటాయించడం ఆలస్యం కావడంతో రెండేళ్ల తర్వాత మొదలు పెట్టారు. ఇరిగేషన్ కార్యాలయం, ఆర్అండ్‌బీ ప్రధాన కార్యాలయం ఆసుపత్రి స్థలం కావడంతో అక్కడ ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నారు. ఇరిగేషన్ కార్యాలయాన్ని ఖాళీ చేయించి అక్కడ సర్జరీ విభాగం పనులు మొదలు పెట్టినా ప్రభుత్వం సకాలంలో నిధులు ఇవ్వక పోవడంతో పనులు నత్తనడకన సాగుతున్నాయి. మరోవైపు ఎంసీహెచ్‌బ్లాక్ నిర్మాణం చేట్టాల్సిన ఆర్అండ్‌బీ భవనాన్ని మూడేళ్లయినా ఇప్పటికీ ఖాళీ చేయలేదు. దీంతో ఎంసీహెచ్‌బ్లాక్ నిర్మాణం ఓ కలగా మారిపోయింది. టీడీపీ అధికారంలోకి రావడంతో ఎంసీహెచ్‌బ్లాక్ నిర్మాణం పూర్తవుతుందని ఆశలు కలుగుతున్నాయి.



ప్రసూతి విభాగంలో అవస్థలు పడుతున్న బాలింతలు



నత్తనడకన సాగుతున్న సర్జరీబ్లాక్ పనులు



ఐదేళ్లుగా పునాదులకే పరిమితమైన జీప్లస్‌టు భవనం

● వైద్యకళాశాల పనులకు గ్రహణం

జిల్లా వైద్యకళాశాలలోను వసతులు కల్పించడం కోసం అప్పటి టీడీపీ ప్రభుత్వం దాదాపు రూ.30 కోట్లు నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతో వైద్యకళాశాల విద్యార్థుల కోసం హాస్టల్ భవనాలు, డాక్టర్లు, వైద్యవిద్యార్థుల కోసం ప్రత్యేకంగా లైబ్రరీ, లెక్చరర్స్ గ్యాలరీ, ల్యాబ్ ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నారు. ఇందు కోసం ఆసుపత్రి ఆవరణంలోని ఆప్తమాలజీ విభాగం వద్ద ఉన్న బయలు స్థలంలో జీ ప్లస్ టు అంతస్థులు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. 2018లో ఆన్‌లైన్‌లో టెండర్ పిలవగా హైదరాబాద్‌కు చెందిన బృందా కన్‌స్ట్రక్షన్ సంస్థ పనులను దక్కించుకుంది. ఆ సంస్థ ఇక్కడ పనులు మొదలు పెట్టి పునాదులు వరకు పిల్లర్స్ వేసింది. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే 20 శాతం లోపు పనులు ఉంటే ఆపేయాలని ఆదేశాలు ఇవ్వగా ఇక్కడ పనులు ఆగిపోయాయి. మూడేళ్ల తర్వాత పనులు పూర్తి చేయాలని బృందా కన్‌స్ట్రక్షన్‌ను ప్రభుత్వం ఆదేశించింది. పనులు చేపడితే తమకు నష్టం వస్తుందని, తాము చేయలేమని సంస్థ చేతులెత్తేసింది. ప్రభుత్వం కోర్టుకు వెళ్లినా కాంట్రాక్ట్ సంస్థకే అనుకూలంగా తీర్పు రావడంతో పనులు పూర్తిగా ఆగిపోయాయి. నిర్మించిన పనులు వర్షానికి నానుతూ ఎండలకు ఎండుతూ దెబ్బతింటున్నాయి. ఇక వైద్య విద్యార్థుల కోసం నిర్మిస్తున్న హాస్టల్ పనులు సైతం మధ్యలోనే ఆగిపోయాయి. ఇలా ఆసుపత్రి, వైద్యకళాశాలలో ఆగిపోయిన పనులకు టీడీపీ ప్రభుత్వం పూర్తి చేయించేందుకు కృషిచేయాలని అనంత జనం కోరుతున్నారు.

మళ్లీ టెండర్ చేపడుతున్నాం

బృందా కన్‌స్ట్రక్షన్ కాంట్రాక్ట్ సంస్థ ఆ పనుల నుంచి పూర్తిగా తప్పుకుంది. ఇప్పటివరకు కోర్టులో కేసు నడుస్తుండగా ఏ నిర్ణయం తీసుకోలేకపోయాం. ఇపుడు కోర్టు వ్యవహారం తెగిపోవడంతో ఆ పనులకు మళ్లీ టెండర్లు పిలవాలని రాష్ట్ర స్థాయిలో నిర్ణయం తీసుకున్నారు. కొత్త ప్రభుత్వం నిర్ణయం మేరకు భవిష్యత్తులో పనులు మొదలు పెడతాం. ఎంసీహెచ్‌బ్లాక్ ఏర్పాటు విషయంలో కూడా ఆర్అండ్‌బీ ఖాళీ చేయకపోవడం వల్లనే పనులు మొదలు పెట్టలేకపోయాం. ఇపుడు ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకుంటుందో చూడాలి.

-మహబూబ్ బాషా, ఈఈ, ఏపీఎంఐసీడీ

రక్తదాత.. నిజమైన హీరో

కలెక్టరు వినోద్‌కుమార్

అనంతపురంటౌన్, జూన్ 14: రక్తమిచ్చి, ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారి ప్రాణాలు కాపాడగలిగిన రక్తదాత నిజమైన హీరో అని జిల్లా కలెక్టరు డాక్టర్ వినోద్ కుమార్ కొనియాడారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని శుక్రవారం స్థానిక పాతూరు సీడీ ఆస్పత్రిలో రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. రక్తదాన శిబిరాల నిర్వాహకులకు ప్రశంసాపత్రాలు అందజేసి, సత్కరించారు. అనంతరం వేడుకలనుద్దేశించి కలెక్టరు మాట్లాడుతూ.. రక్తదానం చేసిన ప్రతి ఒక్కరు హీరోనే అన్నారు. జిల్లాలోని ప్రతిఒక్కరూ రక్తదానానికి ముందుకురావాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తులో కూడా పెద్దఎత్తున రక్తదాన శిబిరాలు నిర్వహించి అత్యవసర సమయాల్లో సాటి మనిషికి సమస్య లేకుండా అందజేయాలని నిర్వాహకులకు కలెక్టరు సూచించారు. రక్తదానానికి తనవంతు సహాయసహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నగర పాలక కమిషనర్ మేఘస్వరూప్, అసిస్టెంట్ కలెక్టరు వినూత్న, మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి, రెడ్‌క్రాస్ సంస్థ చైర్‌పర్సన్ కాపు భారతి, సొసైటీ సభ్యులు, రక్తదాన నిర్వాహకులు, రక్తదాతలు పాల్గొన్నారు.



రక్తదాతకు ప్రశంసాపత్రం అందజేస్తున్న కలెక్టరు

పంచాయతీలో వైసీపీ సెక్రటరీ..!

ఆ పార్టీ మాజీ ప్రజాప్రతినిధికి అడ్డగోలుగా బిల్లులు



- వారంరోజుల క్రితం రూ.15లక్షలు చెల్లింపు
- బిల్లులు చెల్లించాక తీర్మానాలు
- పంచాయతీ వర్కర్లతో పనులు.. మాజీ ప్రజాప్రతినిధి కుటుంబీకులకు బిల్లులు
- పంచాయతీ ఖజానా ఖాళీ చేసిన వైనం
- కార్మికుల జీతాలకు పైసల్లేని దుస్థితి

అనంతపురంరూరల్, జూన్ 14: ఆయన పంచాయతీ కార్యదర్శి, వైసీపీ కార్యదర్శిలా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. ఆయన గురించి తెలిసిన ఎవరిని అడిగినా ఇదే మాట చెబుతారు. ఇతర కార్యదర్శులు ఆయన పేరెత్తితే వామ్మో అంటూ బెంబేలెత్తుతారు. పంచాయతీలో సదరు కార్యదర్శి వ్యవహారాల గురించి ఉన్నతాధికారులు తెలిసినా మిన్నకుండిపోయినట్లు చెబుతున్నారు. ఆయనకు ఏం చెప్పాలన్నా.. మాట్లాడాలన్నా.. ఆలోచిస్తారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. పాలకపక్షం మారినా అయనలో మాత్రం మార్పు రాలేదంటున్నారు. ఇప్పటికీ వైసీపీ సేవలోనే తరిస్తున్నారు. వారంరోజుల కిందట ఓ మాజీ ప్రజాతినిధికి సైలెంటుగా రూ.15లక్షలు బిల్లులు ఇచ్చేశారట. దీనిని బట్టి చూస్తే ఆయన ఏ రీతిలో వైసీపీ ప్రజాప్రతినిధులకు పనిచేస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. ఆయన తీరుతో పంచాయతీ ఖజానా ఖాళీ అయింది. కార్మికులకు ఈనెల వేతనాలు చెల్లించేందు కూడా పైసల్లేని దుస్థితి ఏర్పడిందని ఆ వర్గాలు వాపోతున్నాయి. అనంతపురం రూరల్ మండలంలోని ఓ పంచాయతీ కార్యదర్శి నిర్వాకం ఇది.

ఇష్టారాజ్యంగా బిల్లులు

సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్‌కు రెండు, మూడు నెలల ముందు పంచాయతీలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. అప్పటి ప్రజాప్రతినిధి తన కుటుంబ సభ్యులను బినామీలుగా పెట్టి దాదాపు రూ.3కోట్ల వర్కులు మొదలు పెట్టారు. ఈ క్రమంలో మట్టిరోడ్లు, సీసీ రోడ్ల పనులు కొంతమేర చేపట్టారు. ఈ పనులకు ఎక్కువశాతం పంచాయతీ వర్కర్లనే కూలీలుగా పెట్టేశాడు కార్యదర్శి. కాంక్రీటు పనులు మినహాయిస్తే.. ప్రతిదీ పంచాయతీ కార్మికులతోనే చేయించాడు. తద్వారా ఆ మాజీ ప్రజాప్రతినిధి, అతడి కుటుంబ సభ్యులకు బిల్లులు చేసేశాడు. అభివృద్ధి పనులు చేపట్టాలంటే పంచాయతీ తీర్మాణాలు చేయాలి. పనులు చేసిన తరువాత బిల్లులు చెల్లించాల్సి ఉంటుంది. ఈ పంచాయతీలో మాత్రం ఇందుకు విరుద్ధంగా కార్యదర్శి వ్యవహారాలు నడిపారన్న విమర్శలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. పనులు జరగకనే.. కనీసం తీర్మాణాలు కూడా చేయకుండానే బిల్లులు ఇచ్చేశారు. ఎవరైనా అడిగితే 'వచ్చేది మన (వైసీపీ) ప్రభుత్వమే.. ఏముందిలే.. అనడం' కొసమెరుపు. ఎన్నికల కౌంటింగ్ అనంతరం సదరు ప్రజాప్రతినిధికి రూ.15 లక్షల బిల్లులు ఇచ్చారంటే అయనకు..వైసీపీ అన్నా.. ఆ పార్టీ మాజీ ప్రజాప్రతినిధులన్నా.. ఎంత ప్రేమో అర్థం చేసుకోవచ్చు. ఇటీవల పంచాయతీ పరిధిలోని ఓ లేఔట్ విషయంలో మాజీ ప్రజాప్రతినిధి రూ.కోటి ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు తెలుస్తోంది. లేఔట్ వేసినవారు ఇవ్వకపోవడంతో ఆ ప్రజాప్రతినిధి సూచన మేరకు పంచాయతీ కార్యదర్శి లేఔట్‌కు అనుమతులు లేవంటూ.. ఫ్లెక్సీ ఏర్పాటు చేసి.. ఆ ప్రజాప్రతినిధికి సొమ్ము ఇప్పించేందుకు తనవంతు ప్రయత్నాలు చేశారన్న వాదనలు ఆయావర్గాల నుంచే వినిపిస్తున్నాయి.



పంచాయతీ పరిధిలోని లేఔట్‌కు అనుమతులు లేవంటూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

ఖజానా ఖాళీ

సదరు కార్యదర్శి.. వైసీపీపై ఉన్న అభిమానంతో పంచాయతీ ఖజానా ఖాళీ చేశాడని ఆయావర్గాల ద్వారా తెలుస్తోంది. కోట్ల రూపాయాలు పంచాయతీ ఖజానాలో ఉండగా.. ఆసొమ్మును మాజీ ప్రజాప్రతినిధి, ఆయన కుటుంబ సభ్యులకు అభివృద్ధి పనుల బిల్లుల పేరిట చెల్లించేశాడని తెలుస్తోంది. అలా ఖజానా ఖాళీ చేశారట. తనకు అనుకూలమైన ఓ ఉద్యోగికి రూ.2 లక్షలు పంచాయతీ సొమ్ము డ్రా చేసి ఇచ్చారని ఆయావర్గాల్లో చర్చ సాగుతోంది. ఇలా ఇష్టారాజ్యం చెల్లింపులతో పంచాయతీ ఖజానా ఖాళీ అయిందని తెలుస్తోంది. కనీసం పంచాయతీలో పనిచేసే కార్మికులకు ఈనెల వేతనాలు చెల్లించేందుకు కూడా నిధుల్లేవని ఆ వర్గాల ద్వారా తెలుస్తోంది.

టీడీపీ వారంటే అస్సలు పడదంట..

పంచాయతీ కార్యదర్శికి టీడీపీ వారంటే అస్సలు పడదంట. ఆ పార్టీ వారు ఏదైనా అడిగినా.. ప్రశ్నించినా తీవ్రస్థాయిలో వారిపై మండిపడటం ఆయన నైజమని చెప్పుకుంటున్నారు. టీడీపీ వారికి.. పంచాయతీ కార్యదర్శికి సరిపడని వారికి పంచాయతీ కార్మికులు పనిచేస్తే వారికి వేతనాలు కట్ చేస్తాడన్న చర్చ సాగుతోంది. నాలుగు నెలల ముందు పంచాయతీ పరిధిలోని ఓ కాలనీకి మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే పరిటాల సునీత పర్యటన నేపథ్యంలో స్థానిక టీడీపీ నేతలు.. పంచాయతీ వర్కర్లతో స్థానికంగా చిన్న.. చిన్న పనులు చేయించుకున్నట్లు కార్యదర్శి దృష్టికెళ్లింది. వెంటనే ఆ కార్మికులపై చిందులు వేసి.. వేతనాలు కట్ చేశాడని సమాచారం. ఇటీవల ఎన్నికల పోలింగ్ కేంద్రం వద్ద కూడా వైసీపీ నాయకులకంటే ముందే.. టీడీపీ నేతలపై ఆయన మండిపడడం, వచ్చేది తమ ప్రభుత్వమే అని టీడీపీ నాయకులతోనే అన్నట్లు పంచాయతీలో చర్చ సాగుతోంది. ఆయన వైసీపీ పట్ల ఇంతస్థాయిలో స్వామి భక్తి ప్రదర్శించాడు కాబట్టే.. అప్పటి ప్రజాప్రతినిధులు ఆయనకు మండలంలో ఇతర కార్యదర్శుల కంటే అధిక ప్రాధాన్యమిచ్చారు. గ్రేడ్-4 కార్యదర్శిని.. గ్రేడ్-1గా నియమించుకున్నారంటే.. ఆయన తీరును అర్థం చేసుకోవచ్చు.

పింఛన్ పెంపు అమలు

- బకాయిలతో కలిపి నిధుల కేటాయింపు
- జిల్లాకు అదనంగా రూ.110 కోట్లు
- మొత్తం రూ.197 కోట్లు పంపిణీకి సిద్ధం
- ఉత్తర్వులు జారీ చేసిన నూతన ప్రభుత్వం



అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 14: పింఛన్ పెంపు అమలుకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు ఏప్రిల్ నెల నుంచే అమలు చేస్తామని చెప్పిన సీఎం చంద్రబాబునాయుడు... ఆ మేరకు ఆ హామీ అమలుపై దృష్టి సారించారు. ఏప్రిల్, మే, జూన్ నెలల బకాయిలతో పాటు జూలై నెలతో కలుపుకుని చెల్లించేలా చర్యలు చేపట్టారు. ఈ మేరకు పింఛన్ పెంచుతూ శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ జీఎం నంబరు 43 జారీ చేశారు. జూన్ నెలలో పంపిణీ చేసిన రూ.86.80 కోట్లతో పాటు బకాయిలను చెల్లించనున్నట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. జూలైకి సంబంధించి మొత్తం పింఛన్‌దారులు 2,89,995 మందికి గాను పెంచిన సొమ్ముతో కలిపి రూ.127 కోట్లు, బకాయిలు రూ.70.73 కోట్లు మొత్తం రూ.197 కోట్లు జిల్లాకు కేటాయించారు. గతంలో రూ.3000 పింఛన్‌ను ఏప్రిల్ నుంచి రూ.4,000కు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేశారు. వృద్ధులు 1,44,715 మందికి రూ.101 కోట్లు, వితంతువులు 66,769 మందికి రూ.46.7 కోట్లు, చేనేతలు 6,769 మందికి రూ.5 కోట్లు, కల్లుగీత కార్మికులు 354 మందికి రూ.24 లక్షలు, మత్స్యకారులు 892 మందికి రూ.61 లక్షలు, ఒంటరి మహిళలు 6,737మందికి రూ.4.70 కోట్లు, సఫాయి కర్మాచారులు 3,528 మందికి రూ.2.41 కోట్లు, హిజ్రాలు 207 మందికి రూ.1.45 లక్షలు, హెచ్ఐవీ బాధితులు 2,475 మందికి రూ.రూ.1.70 కోట్లు, డప్పు కళాకారులు 3,141 మందికి రూ.2.20 కోట్లు, కళాకారులు 185 మందికి రూ.1.30 లక్షలు, దివ్యాంగులు 46,439 మందికి రూ.27.86 కోట్లు, కుష్టువ్యాధి బాధితులు 392 మందికి రూ.23 లక్షలు, మంచానికే పరిమితమైన బాధితులు 1,451 మందికి రూ.2,17 కోట్లు, ప్రమాద బాధితులు 1091 మందికి రూ.1.63 కోట్లు ఇతరత్రా బాధితులకు కలిపి మొత్తం 2,89,995 మందికి రూ.197 కోట్లు జూలైలో పంపిణీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. కొత్త పింఛన్ ఎప్పుడు ఇస్తారనేది ఇంకా ప్రభుత్వం నుంచి స్పష్టత రావాల్సి ఉంది. ఇంటివద్దకే పింఛన్ పంపిణీ చేస్తారా... ఏప్రిల్, మే, జూన్ తరహాలోనే చేపడుతారా... అనేది ఉత్తర్వుల్లో పేర్కొనలేదు. పింఛన్ పెంపుపై లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

13 మండలాల్లో వర్షం



అనంతపురం అర్బన్, జూన్ 14 : జిల్లాలోని 13 మండలాల్లో గురువారం రాత్రి వర్షం పడింది. అత్యధికంగా కణేకల్లులో 19.0 మి.మీ. వర్షపాతం నమోదైంది. గుంతకల్లు 11.2, ఆత్మకూరు 10.2, బెలుగుప్ప 9.8, రాప్తాడు 8.0 మి.మీ. వర్షపాతం నమోదైంది. మిగతా ప్రాంతాల్లో 6.2 మి.మీ.లోపు వర్షపాతం నమోదైంది.

రైతులను ఇబ్బంది పెట్టొద్దు

- నెలాఖరులోగా పంటరుణాల రెన్యువల్ పూర్తి చేయాలి
- వెంటనే రుణాల పంపిణీని ప్రారంభించండి
- ఏడీసీసీ బ్యాంకు ఉద్యోగులకు సీఈఓ ఆదేశం



సీఈఓను అభినందిస్తున్న ఏడీసీసీ బ్యాంకు ఉద్యోగుల సంఘం నాయకులు

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 14: ఉమ్మడి జిల్లాలో రైతులను ఇబ్బంది పెట్టొద్దనీ, వెంటనే పంట రుణాల పంపిణీని పునరుద్ధరించాలని ఏడీసీసీ బ్యాంకు ఉద్యోగులకు సీఈఓ సురేఖారాణి ఆదేశించారు. నెలాఖరులోగా పంట రుణాల రెన్యువల్ పూర్తి చేయాలన్నారు. స్థానిక ఎన్టీఆర్ సహకార భవన్‌లోని తన చాంబర్‌లో శుక్రవారం సీనియర్ మేనేజర్లు, అధికారులతో పంట రుణాల చెల్లింపులు, రెన్యువల్‌పై సీఈఓ సురేఖారాణి సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ.. రైతులకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి, ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉన్న 28 శాఖల్లో రూ.650 కోట్ల రైతు రుణాలను నెలాఖరులోపు రెన్యువల్ చేయాలని తెలిపారు. 15 రోజులుగా నిలిపివేసిన పంటరుణాల చెల్లింపులు పునరుద్ధరించాలని సూచించారు. డిపాజిట్ల సేకరణపై దృష్టి సారించాలని తెలిపారు. కార్యక్రమంలో ఏడీసీసీ బ్యాంకు ఉద్యోగుల సంఘం అధ్యక్షకార్యదర్శులు భరత్, సోమశేఖర్, నేతలు జానకిరామ్‌రెడ్డి, సుజాత, ఆర్‌వీ కృష్ణారెడ్డి, మేనేజర్లు పాల్గొన్నారు.

వైసీపీ సోషల్ మీడియా కన్వీనర్ దౌర్జన్యం

యాడికి, జూన్ 14: మండలంలోని కమలపాడు ఆర్బీకేలో 6ఫ్యాన్లు, 7 లైట్లను అదే గ్రామానికి చెందిన వైసీపీ సోషల్‌మీడియా కన్వీనర్ ఎత్తుకెళ్లిన సంఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయడం చట్టరీత్యా నేరమని, అలా చేసేవారు ఎంతటివారినైనా ఉపేక్షించమని పోలీసులు హెచ్చరికలు జారీచేసినా వాటిని లెక్క చేయకుండా ఆయన రైతు భరోసా కేంద్రం తాళాన్ని పగలగొట్టి అందులోని ఫ్యాన్లు, లైట్లను ఎత్తుకెళ్లడం మండలవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. శుక్రవారం విధులకు వెళ్లిన ఆర్బీకే సిబ్బంది కార్యాలయానికి వెళ్లి చూస్తే తాళాలు పగలగొట్టి ఉండడాన్ని గమనించారు. లోపలికి వెళ్లి చూస్తే కార్యాలయంలో అమర్చిన ఫ్యాన్లు, లైట్లను దుండగులు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. ఈ సమాచారం గ్రామంలో హల్‌చల్ చేయడంతో అదే గ్రామానికి చెందిన వైసీపీ సోషల్‌మీడియా కన్వీనర్ ఎత్తుకొచ్చినట్లు బయటపడింది. ఈ విషయాన్ని ఆర్బీకే సిబ్బంది, సచివాలయ మహిళా సంరక్షణ కార్యదర్శులు పోలీసుల దృష్టికి తీసుకువెళ్లడంతో వారు విచారణ చేపట్టారు. ఫ్యాన్లు, లైట్లను ఎత్తుకెళ్లి విక్రయించడానికి సిద్ధం చేసిన కన్వీనర్ నుంచి వాటిని ఆర్బీకే సిబ్బందికి తిరిగి ఇప్పించారు. దీనిపై సీఐ నాగార్జునరెడ్డి వివరణ కోరగా ఆర్బీకేలో ఫ్యాన్లు, లైట్లు ఎత్తుకెళ్లిన మాట వాస్తవమేనని తెలిపారు. వాటిని తీసుకువెళ్లిన వ్యక్తి నుంచి తిరిగి ఆర్బీకే సిబ్బందికి అప్పగించినట్లు తెలిపారు.



కమలపాడు ఆర్బీకేలో ఫ్యాన్ ఎత్తుకెళ్లిన దృశ్యం

విద్యుదాఘాతంతో రైతు మృతి



రైతు గవ్వల లక్ష్మన్న మృతదేహం

రాప్తాడు, జూన్ 14: మండలంలోని బోగినేపల్లి గ్రామానికి చెందిన రైతు గవ్వల లక్ష్మన్న (60) శుక్రవారం కనగానపల్లి మండలం తగరకుంట గ్రామ సమీపంలోని తన పొలంలో విద్యుదాఘాతంతో మరణించాడు. గవ్వల లక్ష్మన్న వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించేవాడు. వ్యవసాయ పని నిమిత్తం శుక్రవారం పొలానికి వెళ్లిన ఆయన ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగిలాడు. విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మరణించాడు. లక్ష్మన్న ఇంటికి రాకపోవడంతో ఆయన భార్య ఈశ్వరమ్మ పొలం వద్దకు వెళ్లింది. లక్ష్మన్న చనిపోయి ఉండటాన్ని గమనించి.. కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చింది. సమాచారం అందుకున్న పోలీసులు, విద్యుత్ శాఖ అధికారులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. లక్ష్మన్నకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉండగా వారందరికీ వివాహాలు అయ్యాయి. కేసు దర్యాప్తులో ఉందని కనగానపల్లి ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు.

నర్సరీల్లో విరివిగా మొక్కలు పెంచండి


- డీఎఫ్‌ఓలకు సీసీఎఫ్ నాగేశ్వరరావు ఆదేశం

అనంతపురం న్యూటౌన్, జూన్ 14: ప్రస్తుతం వర్షాలు బాగా వస్తున్నాయని, అందుకు అనుగుణంగా నర్సరీల్లో మొక్కలు విరివిగా పెంచాలని అనంతపురం జిల్లా డీఎఫ్‌ఓ వినీత్ కుమార్, శ్రీసత్యసాయి జిల్లా డీఎఫ్‌ఓ రవీంద్రరెడ్డికి సీసీఎఫ్ నాగేశ్వరరావు సూచించారు. శుక్రవారం జిల్లా కేంద్రమైన అనంతపురానికి వచ్చిన ఆయన సీసీఎఫ్ కార్యాలయంలోని తమ చాంబర్‌లో డీఎఫ్‌ఓలతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. జిల్లాల్లో గ్రీనరీ పెంచడానికి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడ ఎలాంటి సమస్యలూ తలెత్తకుండా ఫీల్డ్ సిబ్బంది అలర్ట్‌గా ఉండేలా చూడాలన్నారు. అనంతరం ఆయన చిత్తూరు జిల్లా, అనంతపురం ఉమ్మడి జిల్లాలో ఉద్యోన్నతులకు సంబంధించిన ఫైల్ పరిశీలించినట్లు తెలిసింది.

విత్తన వేరుశనగ పంపిణీ

అనంతపురం అర్బన్, జూన్ 14: జిల్లాలోని ఆర్బీకేల్లో 18వ రోజైన శుక్రవారం విత్తన వేరుశనగ పంపిణీ కొనసాగింది. ఇప్పటిదాకా 78,018 మంది రైతులకు 70,619 క్వింటాళ్లు పంపిణీ చేశారు. అలాగే జిల్లా వ్యాప్తంగా ఇప్పటిదాకా 82,022 మంది రైతులు 72,395 క్వింటాళ్ల విత్తన వేరుశనగ కోసం తమ పేర్లు నమోదు చేసుకున్నారు.

సాహో చంద్రబాబు..!



- తొలిసంతకంతో తీపికబురు
- ఎన్నికల ముందు నిరుద్యోగులకు డీఎస్సీ హామీ
- బాధ్యతలు స్వీకరించిన మరుక్షణమే అమలు
- మెగా డీఎస్సీ ఫైల్‌పైనే తొలి సైన్
- రాష్ట్రంలో 16,347 పోస్టుల భర్తీకి శ్రీకారం
- అత్యధికంగా 7,725 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు
- జీవో 27 జారీ
- నిరుద్యోగుల్లో హర్షాతిరేకాలు



అనంతపురం విద్య, జూన్ 14: నిరుద్యోగుల గుండెల్లోని బాధలు చూశారు. ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం ఐదేళ్లపాటు కళ్లు కాయలు కాచేలా ఎదురుచూసిన వారి ఆవేదన విన్నారు. మెగా డీఎస్సీ ఇస్తానంటూ... ఎన్నికల ముందు వాళ్లకు మాట ఇచ్చారు. మాట ఇచ్చినట్టుగానే తొలి సంతకం చేసి.. తీపి కబురు అందించారు. లక్షలాది మంది కళ్లలో ఆనందాన్ని చూశారు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు. మెగా డీఎస్సీ ఫైల్‌పై తొలి సంతకం చేసి, ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నడుం బిగించారు. రాష్ట్రంలో 16,347 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తామంటూ భరోసా నింపారు. దీంతో ఐదేళ్లుగా పోస్టుల భర్తీ లేవన్న ఆవేదనలో, అయోమయంలో, ఆందోళనలో ఉన్న వేలాది మంది నిరుద్యోగులు, ఉపాధ్యాయ పోస్టు ఆశావహులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. చంద్రబాబు రాకతో మళ్లీ ఉపాధ్యాయ పోస్టు భర్తీ ఖాయమనీ, ఈ దఫా ఉద్యోగం సంపాదిస్తామన్న ధీమాతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఐదేళ్లూ ఊరించి... ఆశలపై నీళ్లు..

జగన్ ప్రభుత్వం ఐదేళ్లూ ఊరించి, లక్షలాది మంది నిరుద్యోగుల ఆశలపై నీళ్లు చల్లింది. 2019 ఎన్నికల ముందు.. వేలాది టీచర్ పోస్టులు భర్తీ చేస్తామని జగన్ హామీ ఇచ్చారు. మాట ఇచ్చారని నిరుద్యోగులు ఓటు వేశారు. అధికారంలోకి వచ్చిన జగన్... నిరుద్యోగులను ఏమాత్రం పట్టించుకోలేదు. ఏటా జాబ్ క్యాలెండర్ అంటూ కొత్త నాటకానికి తెరతీశారు. కొత్త ఏడాది క్యాలెండర్‌లో పేజీలు మారుతున్నాయి కానీ... జగన్ ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ విడుదల చేయడంపై ఏ మాత్రం పట్టించుకోలేదు. నిరుద్యోగులు అనేక ఇబ్బందులు పడుతున్నా... ఆందోళనలు చేసినా... బలవంతంగా కేసులు పెట్టడం, వాళ్ల ఆందోళనలను అణచివేయడం వంటి చర్యలకు దిగారు. ఐదేళ్లూ ఇలాగే నిరుద్యోగులపై నిరంకుశంగా వ్యవహరించారు. తీరా ఎన్నికల సమయం రానే వచ్చింది. ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందు... మళ్లీ జగన్‌కు నిరుద్యోగుల ఓట్లు గుర్తుకొచ్చాయి. అప్పుడు ఉన్నఫలంగా ఆయనకు డీఎస్సీ గుర్తుకొచ్చింది. నిరుద్యోగులకు ఎక్కడలేని ప్రేమను ఒలకబోస్తూ... డీఎస్సీకి హడావుడిగా నోటిఫికేషన్ విడుదల చేశారు. 6,100 పోస్టులు మాత్రమే భర్తీ చేసేందుకు నిర్ణయించారు. నిరుద్యోగులు జగన్ మాయమాటలు నమ్మలేదు.

అడగకనే మాట ఇచ్చిన బాబు

నిరుద్యోగులు, ఉపాధ్యాయ ఉద్యోగార్థుల ఆవేదన విన్న చంద్రబాబు... వారు అడగకుండానే మాట ఇచ్చారు. ఎన్నికల ముందే నిరుద్యోగులకు భరోసా కల్పించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే తొలిసంతకం చేస్తానంటూ హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన సీఎం చంద్రబాబునాయుడు... రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్న రోజునే తొలిసంతకంతో నిరుద్యోగులకు తీపి కబురు అందించారు. మెగా డీఎస్సీ అంటూ సంతకం చేసి, వారికి సంతోషాన్ని అందించారు. రాష్ట్రవ్యాప్తంగా 16347 పోస్టులు భర్తీ చేస్తున్నట్లు ప్రకటించారు. 7725 స్కూల్ అసిస్టెంట్, 6371 ఎస్‌జీటీ పోస్టులు, టీజీటీ 1781, పీజీటీ 286, ప్రిన్సిపాల్ 52, పీఈటీ పోస్టులు 132 భర్తీ చేస్తున్నట్లు ప్రకటించారు. మెగా డీఎస్సీకి సంబంధించి జీవో 27 విడుదల చేసింది. దీంతో నిరుద్యోగులు, భావి గురువుల్లో ఆనందం నెలకొంది. తొలి సంతకంలో తీపి కబురు అందించారు అంటూ... ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి కృతజ్ఞతలు చెబుతున్నారు.

ఉద్యోగం వస్తుందన్న నమ్మకం పెరిగింది



మాది చాబాల గ్రామం. బీఏ పూర్తయిన తర్వాత డీఎడ్ చేశా. 2022 నుంచి డీఎస్సీకి ప్రిపేర్ అవుతున్నా. గతంలో జగన్ ప్రభుత్వం టీచర్ పోస్టుల భర్తీపై ఆశించినస్థాయిలో దృష్టి పెట్టలేదు. నాతో పాటు చాలామంది నిరుద్యోగులు నిరుత్సాహపడ్డారు. సీఎం చంద్రబాబు నాయుడు ఇచ్చిన మాట మేరకు 16,347 పోస్టులతో మెగా డీఎస్సీ ఫైల్‌పై తొలి సంతకం చేయడం ఆనందంగా ఉంది. మా లైఫ్ సెటిల్ అవుతుందని నమ్మకం ఏర్పడింది.

- విజయలక్ష్మి, డీఎస్సీ అభ్యర్థి, చాబాల, వజ్రకరూరు మండలం

ఆనందంగా ఉంది



నేను టీచర్ కావాలన్నది మా నాన్న కల. మాది తుగ్గలి. ఇంటర్ తర్వాత కర్నూలు ప్రభుత్వ డైట్ కళాశాలలో డీఎడ్ పూర్తి చేశా. 2022 నుంచి డీఎస్సీకి ప్రిపేర్ అవుతున్నా. 2022లో టెట్ రాశా. 2024లో టెట్‌కు హాజరయ్యా. సీఎం అయిన వెంటనే చంద్రబాబు ఇచ్చిన మాట మేరకు తొలి సంతకం చేయడంతో హ్యాపీగా ఉంది. 16 వేలకుపైగా పోస్టులను భర్తీ చేయనున్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటా.

-తేజశ్విని, డీఎస్సీ అభ్యర్థి

బక్రీద్‌ను ప్రశాంతంగా జరుపుకోండి: ఎస్పీ



ముస్లిం మత పెద్దలతో ఎస్పీ

అనంతపురం క్రైం, జూన్ 14: బక్రీద్ పండుగను మత సామరస్యంతో ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని జిల్లా ఎస్పీ గౌతమి శిషాలి పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాల్‌లో బక్రీద్ నేపథ్యంలో ముస్లిం మత పెద్దలు, పోలీస్ అధికారులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే వార్తలపై అప్రమత్తంగా ఉండాలని, ఏ చిన్న సమస్య వచ్చినా పోలీస్ అధికారులకు తెలియజేయాలని అన్నారు. ఈ సమావేశంలో డీఎస్పీ టీవీవీ ప్రతాప్, ఏఆర్ డీఎస్పీ మునిరాజ, సీఐలు క్రాంతి కుమార్, ధరణికిషోర్, ప్రతాప్‌రెడ్డి, ఆర్ఎస్ఐ జాఫర్ పాల్గొన్నారు.

కంప్యూటర్, క్రాఫ్ట్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం విద్య, జూన్ 14: కంప్యూటర్, క్రాఫ్ట్ కోర్సులకు ఈ నెల 24 లోగా దరకాస్తులు చేసుకోవాలని సాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రతినిధులు ఓబిరెడ్డి, గజలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆఫీస్ ఆటోమేషన్, పీసీ మెయిన్‌టెనెన్స్ అండ్ ట్రబుల్ షూటింగ్, ఆటోకార్డ్, క్రాఫ్ట్ కోర్సులైన యోగా, బ్యూటీషియన్ కోర్సులకు శిక్షణ ఇస్తున్నట్టు పేర్కొన్నారు. నెలరోజులపాటు ఈ శిక్షణ ఇస్తామని, జూన్ నుంచి ఆగస్టు వరకూ శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సెప్టెంబరు లేదా అక్టోబరులో పబ్లిక్ పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారికి స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ ఏపీ స్టేట్ (ఎస్‌బీటీఈటీ) ద్వారా సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. పదో తరగతి, ఇంటర్, ఆపై విద్యార్హతలున్న వారు కోర్సులకు దరకాస్తు చేయడానికి అర్హులన్నారు. వివరాలకు 9059723829, 98857 38299 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

స్కాలర్‌షిప్ రెన్యువల్ చేసుకోండి

కొత్తచెరువు, జూన్14: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌నకు 2019-20, 2021-22 విద్యా సంవత్సరాల్లో ఎంపికైన విద్యార్థులు నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్‌లో రెన్యువల్ చేసుకోవాలని శ్రీసత్యసాయి జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) మీనాక్షి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఆయా సంవత్సరాల్లో 9, 10, 11, 12 తరగతులు చదివిన విద్యార్థులు రెన్యువల్ చేసుకున్నప్పటికీ స్కాలర్‌షిప్ అందకపోతే ఆధార్‌కార్డును బ్యాంకు ఖాతాకు అనుసంధానం చేసుకోవాలని సూచించారు. బ్యాంకు ఖాతాలో డబ్బు జమకాని విద్యార్థుల జాబితాను ప్రభుత్వ పరీక్షల కార్యాలయ వెబ్‌సైట్‌లో ఉంచామన్నారు. ఆ జాబితాలో పేరు ఉన్న విద్యార్థులు త్వరగా బ్యాంకు ఖాతాకు ఆధార్ అనుసంధానం చేసుకుని, డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) ద్వారా నగదు జమయ్యేవిధంగా ఏర్పాటు చేసుకోవాలని డీఈఓ సూచించారు.

చీనీకాయలు టన్ను రూ.35 వేలు

అనంతపురంరూరల్, జూన్ 14: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.35 వేలు, కనిష్ఠంగా రూ.14 వేలు, సరాసరి రూ.22 వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 622 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

వైసీపీ నాయకుల కక్షసాధింపు..!

- 544-డీ జాతీయ రహదారి నిర్వాసితులకు అందని పరిహారం
- రెండేళ్లుగా ఎదురుచూపులు
- వైసీపీ నాయకులకు అందలం
- నిరుపేదలకు మొండిచెయ్యి
- సీఎం చంద్రబాబుపైనే ఆశలు

బుక్కరాయసముద్రం, జూన్ 14: వైసీపీ పాలకుల కక్ష సాధింపుతో 47 కుటుంబాలు వీధిన పడ్డాయి. రెండు సంవత్సరాల నుంచి అదిగో.. పరిహారం.. ఇదిగో పరిహారం.. అన్న మాటే కానీ... మంజూరు అయ్యింది లేదు. ఈ గ్రామంలోని బాధితులంతా నియోజకవర్గంలోని వైసీపీ నేత వద్దకు పోలేదని అక్కసుతో రోడ్డు నిర్వాసితులకు పరిహారం రాకుండా నిలుపుదల చేయించినట్లు ఆరోపణలున్నాయి. అనంతపురం రూరల్ పరిధిలోని పాములాయి గ్రామం నుంచి బుగ్గ వరకు 544 డి జాతీయ రహదారి నాలుగు లేన్ల రోడ్డు చేపడుతున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా బుక్కరాయసముద్రం మండలం రోటరీపురం గ్రామంలో రోడ్డు నిర్మాణంలో భాగంగా ఆ గ్రామానికి చెందిన 135 గృహాలు తొలగించాల్సి ఉంది. ఇందులో అధికార పార్టీకి చెందిన నాయకుల ఇళ్లకు పరిహారం ఎక్కువ రాయించుకున్నారు. నిజమైన పేదలకు చెందిన 47 ఇళ్లకు రూ.2.50 కోట్లు సొమ్ము రాకుండా అప్పట్లో నియోజకవర్గం వైసీపీ నాయకులు అడ్డుకున్నట్లు బాధితులు చెబుతున్నారు. గ్రామంలో వైసీపీ నాయకుడి వద్దకు వెళ్లిన 88 కుటుంబాలకు రూ.4.44 కోట్ల పరిహారం వచ్చింది. మిగిలిన వారికి పరిహారం ఇచ్చే విషయంలో రెండు సంవత్సరాలుగా రెవెన్యూ, ఆర్అండ్‌బీ అధికారులు మీనమేషాలు లెక్కిస్తూ వచ్చారు. పరిహారం ఇవ్వాలని తహసీల్దార్, ఆర్అండ్‌బీ కార్యాలయాల చుట్టు రోడ్డు నిర్వాసితుల కాళ్లు అరిగేలా తిరిగినా వారు స్పందించలేదు. పరిహారం విషయంపై ఎలాంటి సమాధానం చెప్పకుండా దాటేస్తూ వచ్చారు.



పరిహారం ఇప్పించాలని ఎమ్మెల్యేకి విన్నవిస్తున్న గ్రామ ప్రజలు

ఎందుకిలా..!

రోటరీపురం గ్రామంలోని సర్వే నెంబర్‌లో 112-2లో గత 43 సంవత్సరాలుగా 47 పేద కుటుంబాలు నివాసముంటున్నాయి. రెవెన్యూ రికార్డుల్లో ఈ సర్వేనెంబరు రాళ్ల గుట్టగా నమోదు అయ్యింది. 1983లోనే పేదలకు అప్పటి ప్రభుత్వం ఇంటిపట్టాలు మంజూరు చేసింది. రెవెన్యూ అధికారులు పరిహారం పంచే విషయంలో వాస్తవ పరిస్థితి ప్రకారంగా నివేదిక పంపడంలో అలసత్వం వహించారు. ఈ సర్వేనెంబరులో ఎలాంటి నిర్మాణాలు లేవని రెవెన్యూ అధికారులు అప్పట్లో నివేదిక పంపారు. దీంతో ప్రజలకు అందాల్సిన పరిహారం మంజూరు కాలేదు. పరిహారం రాలేదని గ్రామంలో జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులను అప్పట్లో బాధితులు అడ్డుకున్నారు. అప్పటి జాయింట్ కలెక్టర్, రెవెన్యూ, అర్అండ్‌బీ అధికారులు మరో సారి పరిహారం అంచనాలు వేసి ప్రభుత్వానికి నివేదిక పంపారు.

పేదలకు తగ్గించి... వైసీపీ నేతలకు పరిహారం పెంపు

గ్రామంలో రోడ్డు నిర్వాసితులకు రావాల్సిన పరిహారం విభజించు



రోటరీపురం గ్రామ రోడ్డు (ఫైల్)

పాలించు అన్న చందంగా ఆర్అండ్‌బీ, రెవెన్యూ అధికారులు నివేదికలు పంపారు. టీడీపీ మద్దతు దారుల అన్న కక్షతో 47 కుటుంబాలకు పరిహారం నగదును ప్రతి ఇంటికి తగ్గించారు. తగ్గించిన ఆ పరిహారం నగదును వైసీపీ నేతలకు పంచినట్లు బాధితులు పరిహారంలో భారీ అవినీతి జరిగిందని, వెంటనే రోడ్డు నిర్వాసితుల పరిహారంపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

కలెక్టర్ వద్ద ఆగిన ఫైల్..!

రోడ్డు నిర్వాసితుల పరిహారం ఫైల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలోనే ఆగిపోయింది. బాధితులకు పరిహారం ఇవ్వకుండా గతంలో వైసీపీ నేతలు అడ్డుకోవడంతో వీటికి సంబంధించిన ఫైల్ కలెక్టర్ కార్యాలయంలోనే నిలిచిపోయింది. బాధితుల పరిహారం కోసం ప్రభుత్వానికి నివేదిక పంపకుండా కాలయాపన చేస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో సీఎం చంద్రబాబు నాయుడుపై బాధితులు పరిహారం అందుతుందనే ఆశాభావంతో ఉన్నారు. ఈవిషయమై శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణీశ్రీని గ్రామ ప్రజలు కలిసి విన్నవించారు. త్వరలోనే కలెక్టర్‌తో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని రోటరీపురం గ్రామ ప్రజలకు, టీడీపీ నేతలకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

వైసీపీ కక్ష సాధింపు



రోడ్డు విస్తరణలో నా ఇల్లు పూర్తిగా పోయింది. ఇంటి నిర్మాణం చేపట్టి నాలుగు సంవత్సరాలు కూడా కాలేదు. ఇంటి నిర్మాణానికి రూ.30 లక్షలుపైగా ఖర్చు చేశా. ప్రస్తుతం ప్రభుత్వం రూ.23 లక్షలు పరిహారం ఇస్తోంది. ఇంత తక్కువ పరిహారం రావడానికి వైసీపీ నాయకులే కారణం ఇప్పటికైనా సీఎం చంద్రబాబునాయుడు స్పందించి న్యాయం చేస్తారని ఆశిస్తున్నా. **-తరిపోగల వెంకటనాయుడు**

పరిహారం కోసం ఎదురుచూపులు



పరిహారం కోసం రెండు సంవత్సరాల నుంచి ఎదురు చూస్తున్నాం. కేవలం వైసీపీ నేతలు, కార్యకర్తలకే పరిహారం ఇచ్చారు. గ్రామంలో సామాన్య పేద ప్రజలకు వైసీపీ నాయకుల ఒత్తిళ్ల మేరకు ఆర్అండ్‌బీ, రెవెన్యూ అధికారులు పరిహారం ఇవ్వలేదు. స్థానిక ఎమ్మెల్యే బండారు శ్రావణీశ్రీ వెంటనే చొరవ చూపి న్యాయం చేయాలి. **- రాజగోపాల్, కిరాణా వ్యాపారి**

బంగారం చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

- లోన్‌యాప్‌లో చేసిన అప్పులు తీర్చేందుకే చోరీ
- ఆ ఇంట్లో వుడ్‌వర్క్ చేసిన యువకుడే నిందితుడు

అనంతపురం క్రైం, జూన్14: నగరంలోని భవానీనగర్‌లో చోరీ కేసును వన్‌టౌన్ పోలీసులు ఛేదించారు. చంద్రమోహన్‌రెడ్డి ఇంట్లో 30 తులాల బంగారు నగలు చోరీ అయిన విషయం తెలిసిందే. ఈ కేసులో వన్‌టౌన్ పోలీసులు షేక్ ఖాజాపీర్ అలియాస్ షారుఖ్‌ను అరెస్ట్ చేశారు. అతడి నుంచి 30 తులాల బంగారు ఆభరణాలు, రూ.50వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ రెడ్డప్పతో కలిసి డీఎస్పీ ప్రతాప్.. కేసు ఛేదింపు వివరాలు వెల్లడించారు.

లోన్‌యాప్ అప్పులు తీర్చడానికి..

అనంతపురం రూరల్ మండలం నందమూరినగర్‌కు చెందిన షేక్ ఖాజాపీర్ ఇళ్లలో ఉడ్‌వర్క్ చేసేవాడు. లోన్‌యాప్‌ల నుంచి రూ.1.30 లక్షల వరకు అప్పు చేశాడు. వాటి నుంచి ఒత్తిళ్లు రావడంతో చోరీ చేయాలని భావించాడు. రెండు నెలల క్రితం భవానీనగర్‌లోని చంద్రమోహన్‌రెడ్డి ఇంట్లో వుడ్‌వర్క్ చేశాడు. అందులో భాగంగా వార్డ్‌రోబ్‌లో సీక్రెట్ అల్మారా లాంటి క్యాష్ కప్‌బోర్డు చేయించాడు. ఈనెల 13న చంద్రమోహన్‌రెడ్డి దంపతులు కమలానగర్‌లో తాము నిర్వహిస్తున్న ఎలక్ట్రికల్ షాపునకు వెళ్లారు. అదే సమయంలో ఇంటి వద్ద కాపుకాసిన ఖాజా.. ఆ దంపతులు దుకాణానికి వెళ్లగానే బైక్‌ను దూరంగా ఉంచి ఇంటికి వెళ్లాడు. మాస్క్ ధరించి ఇంటి తలుపుకున్న బోల్ట్ వెంచి, తలుపు పక్కనే ఉన్న కిటికీ అద్దం పగలకొట్టాడు. షెల్ఫ్‌లోని చిన్న కప్‌బోర్డులో ఉంచిన 30 తులాల బంగారు ఆభరణాలు, రూ.50 వేల నగదు అపహరించాడు. ఆ బంగారాన్ని ముత్తూట్ ఫైనాన్స్‌లో తాకట్టు పెట్టేందుకు సిద్ధమవుతుండగా.. పోలీసులకు సమాచారం రావడంతో నిందితుడిని అరెస్ట్ చేశారు. 30 తులాల బంగారు నగలు, రూ.37,200 నగదు స్వాధీనం చేసుకున్నారు. సమావేశంలో వన్‌టౌన్, ఫోర్త్‌టౌన్ సీఐలు రెడ్డప్ప, ప్రతాప్‌రెడ్డి, ఏఎస్ఐ నాగేశ్వర్‌రెడ్డి, కానిస్టేబుళ్లు దాస్, ఆసిఫ్, మహమ్మద్, మురళీధర్ పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న నగలను పరిశీలిస్తున్న పోలీసులు

హంస నగర కమిటీ ఏకగ్రీవం



అనంతపురం టౌన్, జూన్ 14 : ఏపీ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ సంఘం నగర కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పాతూరులోని సీడీ ఆస్పత్రిలో జిల్లా కన్వీనర్లు షఫీ, చాముండేశ్వరి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నగర కమిటీ అధ్యక్షుడిగా కుళ్లాయిబాబు, అసోషియేట్ ప్రెసిడెంటుగా శోభారాణి, ఉపాధ్యక్షులుగా అలివేల మంగమ్మ, గిరిధర్‌రెడ్డి, రామాంజినేయులు, తిప్పేరుద్రమ్మ, అంజినమ్మ, సెక్రెటరీలుగా ఆలీ, విశాళాక్షి, లోకేశ్వర్‌రెడ్డి, జాయింట్ సెక్రెటరీలుగా సుదర్శన్‌రెడ్డి, ఉమాదేవి, జమున, సంధ్య, అరుణ ఎన్నికయ్యారు.

కళాకారుల ప్రదర్శనలు అభినందనీయం



కళాకారులను అభినందిస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న

అనంతపురం క్లాక్‌టవర్ : సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కు ప్రాధాన్యతను, ప్రాముఖ్యతను ఓటర్లకు వివరించడంలో కళాకారుల అద్భుత ప్రదర్శనలు అభినందనీయమని జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో స్వీప్ ద్వారా సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఓటు హక్కుపై కళాప్రదర్శనలతో ప్రజలకు అవగాహన కల్పించిన ఓం సంగీత నృత్య కోలాట శిక్షణ సంస్థ వ్యవస్థాపకురాలు కౌసల్య బృందాన్ని అసిస్టెంట్ కలెక్టర్ సన్మానించారు. అనంతరం సర్టిఫికెట్లతో పాటు తిరుపతికి చెందిన జానపద వృత్తికళాకారుల సంఘం ద్వారా ఐడీ కార్డులను అందజేశారు.

ఎంపీఈఓలకు ఉద్యోగ భద్రత కల్పించండి



మంత్రితో సంఘం నాయకులు

అనంతపురం అర్బన్, జూన్ 14 : వ్యవసాయ శాఖలో కొన్నేళ్లుగా కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న ఎంపీఈఓలకు ఉద్యోగ భద్రత కల్పించాలని రాష్ట్ర మంత్రి పయ్యావుల కేశవ్‌ను ఎంపీఈఓల సంఘం నాయకులు కోరారు. శుక్రవారం విజయవాడలోని ఆయన క్యాంపు కార్యాలయంలో ఎంపీఈఓల సంఘం రాయలసీమ జోన్ అధ్యక్షుడు రెడ్డి ప్రసాద్, నాయకులు భాస్కర్ నాయక్, లక్ష్మీనారాయణ మంత్రికి వినతి పత్రం అందజేశారు. వైసీపీ పాలనలో సచివాలయ వ్యవస్థ వచ్చిన తర్వాత కొన్నేళ్లుగా ఎంపీఈఓలకు అన్యాయం చేశారన్నారు. 1500 ఎకరాలకు ఒక ఎంపీఈఓను నియమించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. చిత్తూరు జిల్లాలో ఓడీపై పనిచేస్తున్న అనంత జిల్లాకు చెందిన ఎంపీఈఓలను తిరిగి అనంతలోనే పోస్టింగ్‌లు ఇప్పించి ఆదుకోవాలన్నారు. ఓడీపై వెళ్లకపోవడంతో టర్మినేట్ చేసిన ఎంపీఈఓలకు తిరిగి ఉద్యోగ అవకాశం కల్పించాలని కోరారు. ఇందుకు మంత్రి స్పందిస్తూ.. సీఎం చంద్రబాబు దృష్టికి మీ సమస్యలు తీసుకువెళ్లి పరిష్కరించేలా చూస్తానని హామీ ఇచ్చారు. అనంతరం వ్యవసాయ శాఖ స్పెషల్ కమిషనర్ హరికిరణ్‌కు ఆ సంఘం నాయకులు వినతి పత్రం అందజేశారు.

విద్యుత్ సమస్యపై ఏఈ కార్యాలయం ముట్టడి

అనంతపురంరూరల్, జూన్ 14: నగరంలోని ఇందిరానగర్ పరిధిలో నెలకొన్న విద్యుత్ సమస్యపై సీపీఎం ఒకటో నగర కమిటీ ఆధ్వర్యంలో బళ్లారి బైపాస్ రోడ్డులోని డి-3 సెక్షన్ ఏఈ కార్యాలయాన్ని శుక్రవారం ముట్టడించారు. ఆ పార్టీ కార్యదర్శి రామిరెడ్డి మాట్లాడుతూ.. 49వ డివిజన్ పరిధిలోని ఇందిరానగర్‌లో కరెంటు సమస్య తీవ్రంగా ఉందని, ఎన్నిసార్లు సంబంధిత అధికారులకు చెప్పిన పట్టించుకోలేదని మండిపడ్డారు. చిన్నపాటి వర్షం కురిసినా రోజంతా కరెంటు పోతోందని, అందుకే ఏఈ కార్యాలయాన్ని ముట్టడించామని అన్నారు. ఏఈ రామాంజినేయులు వెంటనే స్పందించి ఇందిరానగర్‌లో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రకాష్, మసూద్, రాజు, డేవిడ్, రామాంజి, అంజి, మోహన్, కాలనీ వాసులు మార్తమ్మ, రాముడు, బాబు, అల్లాబకాష్, ముస్తాఫా, రహంతుల్లా పాల్గొన్నారు.

'మిషన్ లైఫ్'ను అన్ని పాఠశాలల్లో నిర్వహించాలి



విద్యార్థులతో వైఖోమ్ నిదియా


రాప్తాడు, జూన్ 14 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పర్యావరణ పరిరక్షణకు మిషన్ లైఫ్ కార్యక్రమాన్ని అన్ని పాఠశాలల్లో నిర్వహించాలని సమగ్ర శిక్ష ప్రాజెక్టు సమన్వయకర్త వైఖోమ్ నిదియా పేర్కొన్నారు. శుక్రవారం రాప్తాడు ఉన్నత పాఠశాలను సందర్శించిన ఆమె విద్యార్థులతో ముచ్చటించారు. తడి, పొడి చెత్తను వేరు చేయడం... అందుబాటులో ఉన్న మొక్కలను ఎరువుగా తయారు చేసే విధానంపై ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. మిషన్ హెల్త్ కార్యక్రమంలో భాగంగా శనివారం ఈ వేస్ట్ సేకరణపై కార్యక్రమాలు ఎలా నిర్వహించాలో ఉపాధ్యా యులకు అవగాహన కల్పించారు. మిషన్ లైఫ్ రోజూ వారి కార్యక్రమాలను సక్రమంగా నిర్వహించాలని, ఇందులో ఎవరికీ మినహాయింపు లేదని ఆమె తెలిపారు. అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఎకో క్లబ్‌ల సహకారంలో కార్యక్రమాలు నిర్వహించాలని, వాటిని ఎంఈఓలు పర్యవేక్షించాలని సూచించారు. ఎంఈఓ మల్లికార్జున, ప్రధానోపాధ్యాయులు నరసింహులు సెక్టోరియల్ అధికారులు చంద్రశేఖర్‌రెడ్డి, గోపాల్ పాల్గొన్నారు.

స్టాక్ పాయింట్ పరిశీలన : సమగ్రశిక్ష ఏపీసీ వైఖోమ్ నదియా దేవి శుక్రవారం రాప్తాడులోని విద్యార్థుల కిట్స్ మండల స్టాక్ పాయింట్‌ను సందర్శించారు. పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలను విద్యార్థులకు వెంటనే పంపిణీ చేసేలా ప్రధానోపాధ్యాయులకు వెంటనే తెలియచేయాలన్నారు. స్టాక్ పాఠ్య పుస్తకాన్ని ఎలా పారదర్శకంగా నిర్వహించాలో ఎంఈఓ కుళ్లాయప్ప, ఎంఆర్‌సీ బృందానికి తెలియచెప్పారు. కార్యక్రమంలో సీఎంఓ గోపాల్, ఏఎంఓ చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

కార్పొరేట్ ఫీజుల దోపిడీకి అధికారుల అండ

అనంతపురం విద్య, జూన్ 14: జిల్లాలో కార్పొరేట్ విద్యాసంస్థలు పేద విద్యార్థులను ఫీజుల పేరుతో దోపిడీ చేస్తున్నాయని, కొందరు అధికారులు వాళ్లకు అండగా నిలుస్తున్నారని ఫైట్ ఫర్ రైట్, ఏపీ ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్ విద్యార్థి, దళిత సంఘాల నాయకులు నేతలు మండిపడ్డారు. గురువారం ఆయా సంఘాల నాయకులు డీఈఓ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. ఫైట్ ఫర్ రైట్స్ సంస్థ అధ్యక్షుడు కేపీ రాజు, ఏపీ ఎమ్మార్పీఎస్ రాయలసీమ జిల్లాల అధ్యక్షుడు రమణ, రాష్ట్రప్రధాన కార్యదర్శి నారాయణస్వామి, ఎస్సీ ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి, విద్యార్థి రాజకీయ పార్టీ నేత రామన్న, ఎంఎస్ఎఫ్ రాష్ట్ర నాయకుడు నగేష్ మాట్లాడారు. విద్యాహక్కు చట్టం మేరకు ప్రైవేట్, కార్పొరేట్ సంస్థల్లో 25 శాతం ఉచిత సీట్ల అమలు ఏ మాత్రం చేయడం లేదన్నారు. డీఈఓ వరలక్ష్మితో వాగ్వాదానికి దిగారు. దీంతో ఆఖరికి డీఈఓ స్పందిస్తూ ఇప్పటికే అధికారులతో కమిటీని వేశామని, వారం రోజుల్లో విచారణ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని చెప్పుకొచ్చారు. దీంతో వారు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు ఆంజనేయులు, సుబ్బరాయుడు, సాంబశివుడు, తరిమెల రాజు, సంధ్యారాణి, నాగరాజు, సుధాకర్, శంకర్‌రెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, మారుతీ, అనిల్, సిద్ధు, శంకరప్ప, శీనా, పక్కీరప్ప పాల్గొన్నారు.

దత్తారెడ్డి మెరుపు సెంచరీ



అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 14: స్థానిక అనంత క్రీడాగ్రామం ఆర్డీటీ స్టేడియంలో శుక్రవారం నిర్వహించిన అంతర్-23 ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సౌత్‌జోన్ క్రికెట్ పోటీల్లో దత్తారెడ్డి మెరుపు సెంచరీ చేశాడు. అనంతపురం, నెల్లూరు జట్లు తలపడగా... అనంతపురం మొదట బ్యాటింగ్ చేసి నిర్ణీత 25 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 214 పరుగులు చేసింది. ఇందులో ఎంకే దత్తారెడ్డి 50 బంతుల్లో 122 పరుగులు చేశాడు. అనంతరం బరిలోకి దిగిన నెల్లూరు 23.4 ఓవర్లలో 175 పరుగులకు ఆలౌట్ అయ్యింది. దీంతో అనంతపురం జట్టు 39 పరుగుల తేడాతో విజయం సాధించింది. మరో మ్యాచ్‌లో కడప, కర్నూలు జట్లు పోటీ పడగా.... మొదట బ్యాటింగ్ చేసిన కర్నూలు 26 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 157 పరుగులు చేసింది. సాయిసూర్య తేజ 74 పరుగులు చేశాడు. అనంతరం బరిలోకి దిగిన కడప 24.2 ఓవర్లలో 112 పరుగులకు ఆలౌట్ అయ్యింది. కర్నూలు 45 పరుగుల తేడాతో గెలుపొందింది. ఈ కార్యక్రమంలో జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి మధు ఆచారి, సెలెక్టర్లు నాగిని కుమార్, షాబుద్దీన్ పాల్గొన్నారు.

ఆరు ఇసుక టిప్పర్లు సీజ్

శింగనమల : స్థానిక ఎస్ఐ చంద్రశేఖర్ సిబ్బందితో వెళ్లి మండలంలోని ఉల్లికల్లు ప్రాంతం నుంచి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ఆరు టిప్పర్లను శుక్రవారం తెల్లవారుజామున సీజ్ చేశారు. వాటిని స్టేషన్‌కు తరలించారు.

త్వరలో అన్న క్యాంటీన్లు పునఃప్రారంభం

అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్





ఎమ్మెల్యే దగ్గుపాటికి శుభాకాంక్షలు తెలుపుతున్న అశోక్‌నాయక్

బళ్లారి రోడ్డులోని అన్న క్యాంటీన్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

అనంతపురం అర్బన్, జూన్ 14: తక్కువ ధరకే పేదలకు అన్నం పెట్టే అన్న క్యాంటీన్లను త్వరలోనే పునః ప్రారం భిస్తున్నట్లు అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ పేర్కొన్నారు. ఇచ్చిన మాట ప్రకారం సీఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేసిన తొలి రోజే ఐదు హామీల అములుపై సంతకం చేసిన విషయం తెల్సిందే. అందులో అన్న క్యాంటీన్లను పునరుద్ధరణ ఒకటి. ఈ నేపథ్యంలో శుక్రవారం స్థానిక బళ్లారి రోడ్డు, రైల్వే స్టేషన్ సమీపంలో, పాతూరులోని అన్న క్యాంటీన్లను స్థానిక ఎమ్మెల్యే పరిశీలించారు. పించన్ల పెంపు... త్వరలో అన్న క్యాంటీన్ల పునఃప్రారంభంపై ఆనందం వ్యక్తం చేస్తూ వృద్ధులు, మహిళలకు ఎమ్మెల్యే స్వీట్లు పంచారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... అన్న క్యాంటీన్లను జగన్ కక్ష్యపూరితంగా మూయించాడని, త్వరలో వాటిని తిరిగి తెరిపించి పేదలకు తక్కువ ధరకే భోజనం అందిస్తామని అన్నారు. అనంతపురం నగరంలో కొందరు నాయకులు బదిలీలు చేయిస్తామని.. పదవులు ఇప్పిస్తామని తన పేరు చెబితే ఎవరూ నమ్మొద్దని, అలాంటి సంఘటనలు ఎవరికైనా ఎదురైతే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట టీడీపీ రాష్ట్ర నాయకులు గంగారామ్, గాజుల ఆదెన్న, నాయకులు సాలార్‌బాషా, పోతుల లక్ష్మీనరసింహులు, ముక్తియార్, బాబాఫక్రుద్దీన్, రాయల్ మురళీ, లింగారెడ్డి, గుర్రం నాగభూషణం, లక్ష్మీనరసింహ, కృష్ణకుమార్, కూచి హరి, కడియాల కొండన్న, చెరుకూరి శివ, తొండపాటి రమేష్, సంగా తేజస్విని, లక్ష్మీనాయుడమ్మ ఉన్నారు.

పూలహారాలు, శాలువాలతో రావొద్దు

తనకు శుభాకాంక్షలు తెలిపేందుకు వచ్చే నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పూలహారాలు, పుష్పగుచ్ఛాలు, శాలువాలు తీసుకురావద్దని దగ్గుపాటి ప్రకటనలో కోరారు. తనకు శుభాకాంక్షలు తెలిపేందుకు వచ్చేవారు ఇక నుంచి మొక్క లు, పుస్తకాలు, పెన్నులు తీసుకురావాలని కోరారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు, పేద విద్యార్థులకు ఇవ్వడానికి పుస్తకాలు, పెన్నులు తీసుకురావాలన్నారు.

దగ్గుపాటి ప్రసాద్‌కు శుభాకాంక్షలు

అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌కు అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్ నాయక్ శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం స్థానిక పాతూరులోని అన్న క్యాంటన్ పరిశీలనకు వచ్చిన దగ్గుపాటి ప్రసాద్‌ను ఆయన కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పదించారు.

వైసీపీ అవినీతి, అక్రమాలు వెలికితీస్తా

టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వైకుంఠం ప్రభాకర్ చౌదరి



అనంతపురం అర్బన్, జూన్ 14 : వైసీపీ ఐదేళ్ల పాలనలో అనేక అవినీతి, అక్రమాలు జరిగాయని, వాటిని వెలికితీస్తానని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వైకుంఠం ప్రభాకర్ చౌదరి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక రాంనగర్‌లోని తన కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మద్యం, ఇసుక, విద్యుత్ కొనుగోలు తదితర అనేక అంశాల్లో అవినీతి, అక్రమాలు పెద్ద ఎత్తున జరిగాయన్నారు. మాజీ మంత్రి పాపాల పెద్దిరెడ్డికి భారీ కుంభకోణంలో అవినీతి భాగస్వామ్యం ఉందని ఆరోపించారు. ప్రధానంగా భూగర్భ గనుల శాఖలో అవినీతి ఎక్కువగా జరిగిందన్నారు. ఇసుకలో దోచుకునేందుకు తమిళనాడు కంపెనీ అమిగోష్‌కు హద్దులు లేకుండా తవ్వుకొనే అవకాశం కల్పించి వందల కోట్లు కొల్లగొట్టారన్నారు. తుగ్లక్ జగన్ పాలనలో అమిగోష్ మినరల్స్, ప్రసాద్‌రెడ్డి తదితరులు అగ్రిమెంట్ పేరుతో ప్రైవేటు మాఫియాను నడిపారన్నారు. ఏడాదికి రూ.259.10 కోట్లు ప్రభుత్వానికి చెల్లించి, మిగిలినవన్నీ దోచుకునే విధంగా అగ్రిమెంట్ రాసుకున్నారన్నారు. ఇసుక తవ్వకాలు తదితర వివరాలు వెల్లడించకుండా యథేచ్ఛగా దోపిడీకి పాల్పడ్డారన్నారు. దేశ చరిత్రలో ఎన్నడూ జరగని విధంగా భారీ ఇసుక కుంభకోణంపై సీఎం చంద్రబాబునాయుడు, సంబంధిత మంత్రిని కలిసి ఇసుక కుంభకోణంలో వివరాలు అందజేస్తామన్నారు. అవసరమైతే కోర్టుకు వెళతామన్నారు. ఇంత వరకు గోప్యంగా ఉంచిన అగ్రిమెంట్ , ఇసుక తవ్వకాలు తదితర అంశాలపై ప్రభుత్వం విచారణ చేపట్టి అక్రమార్కులను శిక్షించాలన్నారు. అవినీతి సొమ్మును రికవరీ చేసి కరువు జిల్లా అనంత అభివృద్ధికి ఖర్చు చేయాలని కోరారు. త్వరలో మరిన్ని వైసీపీ బండారాలను బయటపెడతామని స్పష్టం చేశారు.

అభివృద్ధి చేసి రుణం తీర్చుకుంటా

శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ



శింగనమల సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

శింగనమల, జూన్ 14: నియోజకవర్గ ప్రజలు ఎంతో నమ్మ కంతో తనను గెలిపించారని, సమస్యలు పరిష్కరించి.. అభివృద్ధి చేసి.. వారి రుణం తీర్చుకుంటానని శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ స్పష్టం చేశారు. చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీల్లో ఐదింటిపై ముఖ్యమంత్రిగా తొలి సంతకం చేయడంపై స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద లబ్ధిదారులు అభినందన సభను శుక్రవారం నిర్వహించారు. ఇందులో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. శియోజకవర్గంలో ఏ సమస్య ఉన్నా.. వెంటనే తన దృష్టికి తేవాలన్నారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి ఎంపీడీఓ బీవెంకటరమణ, టీడీపీ నాయకులు డేగల కృష్ణ మూర్తి, ఆదినారాయణ, మారుతి నాయుడు ఈశ్వర్‌రెడ్డి, షాలిని ముత్యాల లక్ష్మీదేవి పాల్గొన్నారు.

రైతులకు సబ్సిడీ పథకాలు అందించండి

గార్లదిన్నె : చిన్న, సన్న కారు రైతులకు ప్రభుత్వం నుంచి వచ్చే సబ్సిడీ పథకాలను తప్పకుండా అందించాలని శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ సూచించారు. శుక్రవారం అనంతపురం వ్యవసాయ సంచాలకుడు రవి, గార్లదిన్నె, బుక్కరాయసముద్రం మండలాల ఏఓలు నగరంలోని ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... రైతులకు అందుబాటులో ఉంటూ తగు సలహాలు.. సూచనలు ఇవ్వాలని సూచించారు.

హామీల అమలుపై టీడీపీ సంబరాలు

చెన్నేకొత్తపల్లి, జూన్ 14: సీఎంగా చంద్రబాబునాయుడు ఇచ్చిన మాట ప్రకారం ఐదు హామీలపై తొలి సంతకం చేయడంపై సీకేపల్లి టీడీపీ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం సంబరాలు నిర్వహించారు. స్థానిక నాగాబావి ముత్యాలమ్మ దేవాలయంలో 101 టెంకాయలు కొట్టారు. అనంతరం సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటి సీఎం పవన్‌కల్యాణ్, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాలసునీత చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ ముత్యాల్‌రెడ్డి, అంకే అమరేంద్ర, నాయకులు మాడెం సూర్యనారాయణరెడ్డి, చెన్నకేశవుల గౌడ్, చంద్రాయుడు, కోళ్లసూరి, అమరేంద్రరెడ్డి, నారాయణరెడ్డి, రమేశ్, నాగరాజు, బెస్తనాగార్జున, వెంకటేశ్, సావిత్రి, పార్థసారధి, గుడిపల్లిరామాంజి, సూరి పాల్గొన్నారు.

గార్లదిన్నె : నారా చంద్రబాబునాయుడు ఐదు హామీలపై తొలి సంతకం చేయడంపై టీడీపీ నేతలు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు మండలంలోని ఎగువపల్లి గ్రామంలో టీడీపీ నాయకులు గాలెమ్మ అమ్మవారి దేవాలయం వద్ద 202 టెంకాయాలు కొట్టి మొక్కు తీర్చుకున్నారు. చంద్రబాబునాయుడు ఫొటోకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు మాధవ, నాగరాజు, సామాల మధు, నలపరెడ్డి, సామాల రామాంజి, టీ రామాంజి ఆచారి, హనుమంతు, రామచంద్ర, ఆది, ఆనంద్, రామాంజి, రాజుగోపాల్, రమేష్ పాల్గొన్నారు.





సీకేపల్లి, ఎగువపల్లిలో చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న టీడీపీ నేతలు

రక్తదాతలే నిజమైన ప్రాణదాతలు



రక్తదానం చేస్తున్న ఆస్పత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు

అనంతపురం టౌన్, జూన్ 14 : రక్తదాతలే నిజమైన ప్రాణదాతలని జిల్లా సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురష్కరించుకొని శుక్రవారం జిల్లా ఆస్పత్రిలో పెథాలజీ విభాగం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. అందులో ఆస్పత్రి సూపరింటెండెంట్‌తోపాటు 74 మంది రక్తదానం చేశారు. ఆర్ఎంఓలు పద్మజ, హేమలత పర్యవేక్షణలో ఈ శిబిరం చేపట్టారు. సూపరింటెండెంట్ మాట్లాడుతూ.. ఎన్నిసార్లు రక్తం దానం చేసినా ఎలాంటి సమస్యలు రావన్నారు. కార్యక్రమంలో బ్లడ్‌బ్యాంకు ఇన్‌చార్జ్ డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ పరదేశీనాయుడు, బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్లు మురళి, రమణారెడ్డి, సుజాత, విజయలక్ష్మీ పాల్గొన్నారు.

అర్బన్ బ్యాంకు ఆధ్వర్యంలో...

అనంతపురం క్లాక్‌టవర్: ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం అర్బన్ బ్యాంకు ఆధ్వర్యంలో స్థానిక పాతూరులోని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. బ్యాంకు ఉద్యోగులు, ఖాతాదారులతో పాటు సుమారు వందమంది రక్తదానం చేశారు. ఈ శిబిరాన్ని నిర్వహించిన అర్బన్ బ్యాంకు సీఈఓ విజయభాస్కర్, డైరెక్టర్ సుంకర రమేష్‌ను కలెక్టర్ వినోద్‌కుమార్ సత్కరించారు.

న్యాయాధికారిని నియమించాలి

అనంతపురం క్రైం: అనంతపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారిని వెంటనే నియమించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని బార్ అసోసియేషన్ కోరింది. శుక్రవారం బార్ అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో అధ్యక్షుడు గురుప్రసాద్, ప్రధాన కార్యదర్శి రాజేంద్రప్రసాద్, సభ్యులు, న్యాయవాదులతో పలు అంశాలపై చర్చించారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను ప్రభుత్వం రద్దు పరచడంపై ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలియజేస్తూ తీర్మానం చేశారు. కార్యక్రమంలో కోశాధికారి ఆంజనేయులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

రేపు గాయత్రి జయంతి వేడుకలు

అనంతపురం కల్చరల్, జూన్ 14: వేదమాత గాయత్రి జయంతిని పురస్కరించుకుని ఆదివారం పాతూరు వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో వేడుకలు నిర్వహిస్తున్నామని, విరివిగా పాల్గొన్ని ఆ వేడుకలను జయప్రదం చేయాలని ఆర్యవైశ్య యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శబరి వరప్రసాద్ శుక్రవారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. ఆదివారం ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు గాయత్రి హోమం నిర్వహిస్తామన్నారు. ఉదయం 7 గంటలకు అమ్మవారి ఉత్సవమూర్తితో నగరోత్సవం, 11 గంటలకు భక్తుల సామూహిక లలితా, విష్ణు సహస్రనామ పారాయణాలు ఉంటాయన్నారు. భక్తులు విరివిగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

నేడు సంగీత విభావరి

గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం 78వ జయంతిని పురస్కరించుకుని స్థానిక లలితకళాపరిషత్‌లో శనివారం సాయంత్రం ఆరు గంటలకు సంగీత విభావరి నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు తలారి శ్రీనివాసులు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమానికి సంగీత కళాకారులు, కళాభిమానులు విరివిగా హాజరై జయప్రదం చేయాలని కోరారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సేవలో ఏఎస్పీ

గార్లదిన్నె, జూన్ 14: మండలంలోని కోటంక గ్రామ సమీపంలోని శ్రీ గుంటి సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని జిల్లా అడిషనల్ ఎస్పీ విజయ్‌భాస్కర్‌రెడ్డి శుక్రవా రం దర్శించుకున్నారు. కార్యక్రమంలో సీఐ శ్రీధర్, ఎస్ఐ మహమ్మద్‌గౌస్, సర్పంచు ఎర్రిస్వామి, సుబ్బరాయుడు, సబ్రహ్మణ్యం, సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఆరుగురిపై కేసు

అనంతపురం క్రైం: రాచానపల్లిలోని ఆర్‌బీకే కేంద్రంలోని శిలాఫలకాన్ని ఇటీవల ధ్వంసం చేసిన విషయం తెల్సిందే. ఈ ఘటనలో ఆరుగురిపై అనంతపురం రూరల్ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు.

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుపై హర్షం

అనంతపురం కల్చరల్, జూన్ 14 : ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని అమలు చేస్తూ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేస్తూ సంతకం చేయడం హర్షదాయకమని ఏపీ రైతుసంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు తరిమెల నాగరాజు, చంద్రశేఖర్‌రెడ్డి శుక్రవారం సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రైతుల్లో తీవ్ర ఆందోళన కలిగించిందని, ఈ యాక్ట్ రైతులకు మేలు చేయడం కంటే నష్టం కలిగించేదిగా ఉందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రైతాంగం కోరిన మేరకు యాక్ట్‌ను రద్దు చేస్తూ నూతన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సంతకం చేసి రైతుపక్షపాతిగా నిలిచాడని కొనియాడారు.

నసనకోటలో పగలే చోరీ

రామగిరి, జూన్ 14: మండలంలోని నసనకోట గ్రామంలో మాల రామాంజినేయులు ఇంట్లో శుక్రవారం మధ్యాహ్నం చోరీ జరిగింది. ఆయన ఇల్లు గ్రామ చివరన ఉంది. మధ్యాహ్నం ఆయన ఇంటికి తాళం వేసి వెళ్లిన సమయంలో.. గుర్తు తెలియని దొంగలు ఆ ఇంటి తాళం పగలకొట్టి.. బీరువాలో ఉన్న రూ.1.80 లక్ష, రెండు తులాల బంగార ఆభరణాలు ఎత్తుకెళ్లారు. అనంతరం వచ్చిన ఇంట్లో చోరీ జరిగినట్లు గుర్తించి.. పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ వెంకటేశ్వర్లు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

సాయిబాబా ఆలయంలో హుండీ అపహరణ

ధర్మవరంరూరల్, జూన్ 14: కనగానపల్లి మండలంలోని మామిళ్లపల్లి గ్రామంలో గురువారం రాత్రి షిర్డీసాయిబాబా ఆలయంలో గుర్తుతెలియని వ్యక్తులు హుండీ చోరీ చేసి అందులోని నగదును ఎత్తుకెళ్లారు. ప్రభుత్వ పాఠశాల పక్కనే ఉన్న ఈ సాయిబాబా ఆలయంలోకి రాత్రి వేళలో ఆ దుండుగలు చొరబడి ఆలయం తలుపులు పగలగొట్టి హుండీ ఎత్తుకెళ్లారు. దాన్ని గ్రామశివార్లలోకి ఎత్తుకెళ్లి హుండీ తాళం పగలగొట్టి అందులో ఉన్న సుమారు 10 వేలు నగదు ఎత్తుకెళ్లినట్లు గ్రామస్థులు తెలిపారు. కాగా ఈ చోరీపై గ్రామస్థులు, ఆలయ కమిటీ సభ్యులు ఎటువంటి ఫిర్యాదు చేయలేదని పోలీసులు తెలిపారు.

జూదరుల అరెస్టు

గార్లదిన్నె, జూన్ 14 : మండలంలోని యర్రగుంట్ల గ్రామ సమీపంలో శుక్రవారం సాయంత్రం ఐదుగురు పేకాట రాయిళ్లను అరెస్టు చేసినట్లు ఎస్ఐ మహమ్మద్‌గౌస్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ. 7500 స్వాధీనం చేసుకున్నామన్నారు.

కక్కలపల్లిలో మారిన వాటర్ ప్లాంట్ రంగు



అనంతపురంరూరల్ : మండలంలోని కక్కలపల్లి గ్రామంలోని వాటర్ ప్లాంట్ రంగు మారింది. 2016 తెలుగుదేశం పార్టీ హయంలో నాటి మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే పరిటాల సునీత ప్రత్యేక చొరవతో ఎన్టీఆర్ ప్రజల స్రవంతి పథకం కింద వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. అయితే 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చినం తరం ఆ ప్లాంట్‌కు వైసీపీ రంగు వేశారు. ఇప్పుడు మళ్లీ టీడీపీ అధికారంలోకి రావడంతో గ్రామ మాజీ ఎంపీటీసీ నారాయణస్వామి వైసీపీ రంగు మార్పించారు.

క్రికెట్ పోటీల్లో బాలికల జట్టుకు ద్వితీయ స్థానం



అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 14 : ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అండర్-15 సౌత్‌జోన్ బాలికల క్రికెట్ పోటీల్లో జిల్లా జట్టుకు ద్వితీయ స్థానం దక్కింది. నెల్లూరు జిల్లా వెంకటగిరిలో నిర్వహించిన ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అండర్-15 సౌత్‌జోన్ బాలికల క్రికెట్ పోటీల్లో పాయింట్ల ఆధారంగా నెల్లూరు మొదటి స్థానం, అనంతపురం జట్టుకు రన్నర్‌గా నిలిచింది. ఈ టోర్నీలో జిల్లా క్రీడాకారులు హిమవర్షిణి 110 పరుగులు, ఛాయా 109 పరుగులు చేయగా, బౌలర్ చక్రిక 18 పరుగులు చేసి 7 వికెట్లతో ఆల్‌రౌండర్ షో ప్రదర్శించింది. క్రీడాకారుల ప్రతిభ ఆధారంగా జిల్లాకు ద్వితీయ స్థానం దక్కడం అభినందనీయమని జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి మధు ఆచారి తెలిపారు.

ప్రభుత్వ పథకాల వివరాలను సకాలంలో అందించండి

అనంతపురం న్యూటౌన్, జూన్ 14: ప్రభుత్వం పథకాలకు సంబంధించి వివరాలను సకాలంలో అందించాలని డీఎల్‌పీఓ సుమన జయంతి ఈఓఆర్డీలకు ఆదేశించారు. శుక్రవారం డీఎల్‌పీఓ కార్యాలయంలోని తన చాంబర్‌లో డివిజన్ పరిధిలోని ఈఓఆర్డీలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వం నుంచి జారి అయ్యే ఫార్మెట్స్‌కు సంబంధించి పంచాయతీ క్షేత్రస్థాయి సిబ్బంది పూర్తి వివరాలు సకాలంలో అందించేలా చూడాలన్నారు. సమావేశంలో ఏఓ సోమశేఖర్, ఈఓఆర్డీలు దామోధర్‌రెడ్డి, దామోదరమ్మ, నరసింహారెడ్డి లక్ష్మీనరసమ్మ, వెంకటలక్ష్మమ్మ, మురళీకృష్ణ పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌ను పరిశీలించిన అమిలినేని


అన్న క్యాంటీన్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

కళ్యాణదుర్గం, జూన్ 14: పట్టణంలో ఆర్ అండ్‌బీ గెస్ట్‌హౌస్ వద్ద నున్న అన్న క్యాంటీన్‌ను ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు శుక్రవారం పరిశీలించారు. స్థానిక నాయకులతో కలసి వెళ్లి క్యాంటీన్ భవనాన్ని, పరిసర ప్రాంతాలను పరిశీలించారు. జులై చివరి వారం లేదా ఆగస్టు మొదటి వారానికల్లా భవన నిర్మాణాన్ని పూర్తి చేస్తామన్నారు. నిరుపేదలకు అన్న క్యాంటీన్ ద్వారా వారి ఆకలి తీర్చడమే టీడీపీ ప్రధాన లక్ష్యమన్నారు. అందుకోసమే శరవేగంగా భవన మరమ్మతు పనులను పూర్తిచేసే బాధ్యతను తీసుకుంటున్నామన్నారు. అనంతరం ప్రజావేదిక వద్ద సురేంద్రబాబుకు శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. ఉద్యోగులు, ఉద్యోగ సంఘ నాయకులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, పట్టణ వాసులు అమిలినేని సురేంద్రబాబుకు పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు. అమిలినేని అల్లుడు అవినాష్‌కు జ్ఞాపికను అందజేసి పుష్పగుచ్ఛాలు, పూలహారాలతో పట్టణవాసులు, అభిమానులు, సన్మానించారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వైపీ రమేష్, పట్టణ కన్వీనర్ శర్మస్ వలీ, క్లస్టర్ ఇన్‌చార్జి డిష్ మురళి, మాజీ మండల కన్వీనర్ డీకే రామాంజనేయులు, మండల కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు, ధనుంజయ, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బుజ్జి పాల్గొన్నారు.


అవినాష్‌కు జ్ఞాపిక ఇచ్చి సన్మానిస్తున్న పట్టణ వాసులు

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం


చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న వృద్ధులు, టీడీపీ శ్రేణులు

బెళుగుప్ప, జూన్ 14: మండలంలోని బెళుగుప్ప తండాలో శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు పింఛన్ పెంపునకు చర్యలు తీసుకుంటూ ఫైల్‌పై సంతకం చేయడంతో ఆయన చిత్రపటానికి వృద్ధులు, టీడీపీ నాయకులు క్షీరాభిషేకం చేశారు. విడతల వారిగా కాకుండా ఒకేసారి రూ.4 వేలకు పెంచడంతో నిరుపేద వృద్ధులకు ఎంతో ఊరటనిచ్చిందని సంతోషం వ్యక్తం చేశారు. లక్ష్మీబాయి, ప్రభాకర్ నాయక్, విజ్జి నాయక్, లాల్యానాయక్, శీనానాయక్, ప్రవీణ్ నాయక్ పాల్గొన్నారు.

మాట నిలబెట్టుకున్న చంద్రబాబు


ఎన్టీఆర్ విగ్రహం వద్ద కేక్ కట్‌చేస్తున్న గుమ్మనూరు నారాయణ స్వామి

గుంతకల్లు, జూన్ 14: ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి చంద్రబాబు నెరవేరుస్తూ ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారని ఎమ్మెల్యే సోదరుడు గుమ్మనూరు నారాయణస్వామి అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్‌లో నారాయణ స్వామి ఆధ్వర్యంలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి, కేక్‌ను కట్‌చేశారు. ఆయన మాట్లాడుతూ సీఎం పదవిని అధిష్ఠించిన వెంటనే చంద్రబాబు తొలి సంతకం మెగా డీఎస్సీ ఉత్తర్వుపై, రెండో సంతకాన్ని ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుపై, మూడో సంతకాన్ని పింఛన్ల మొత్తం రూ.4 వేలకు పెంపుతోపాటు మరో రెండు ఉత్తర్వులపై సంతకాలు పెట్టారన్నారు. అంచెలంచెలుగా సూపర్ సిక్స్ పథకాలతోపాటు ఎన్డీఏ ఇచ్చిన హామీలన్నింటినీ సీఎం తప్పక నెరవేరుస్తారన్నారు. మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ కోడెల అపర్ణ, టీడీపీ నాయకులు బండారు ఆనంద్, బీఎస్ కృష్ణారెడ్డి, గుమ్మనూరు వెంకటేశులు, తలారి మస్తానప్ప, పత్తి హిమబిందు, కే కృపాకర్, యూ ప్రభాకర్, అహ్మద్ బాషా, కురుబ చంద్రశేఖర్, ఫ్రూట్ మస్తాన్, ఫజులు, షర్ఫుద్దీన్, గిడ్డయ్య, వరలక్ష్మి, అంజలీదేవి, లక్ష్మి పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్లకు మోక్షం


గుత్తిలోని అన్న క్యాంటీన్ భవనం

గుత్తి,జూన్14: ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి తొలప్రాధాన్యంశాలుగా ఐదు వాటిపై సంతకాలు చేశారు. అందులో అన్న క్యాంటీన్ పునరుద్ధరణతో పేదలు, రైతు కూలీలకు ఆశలు చిగురించాయి. 2014లో టీడీపీ ప్రభుత్వం పెద ప్రజల ఆకలి తీర్చడానికి అన్న క్యాంటీన్లను ప్రారంభించింది. పట్టణంలోని గాంధీ సర్కిల్ ఎదుట ఆర్అండ్‌బీ అతిథి గృహం అవరణంలో అన్నక్యాంటీన్ నిర్మాణం చేపట్టింది. రూ.5లకే బోజనం పెట్టి పేదల, బడుగుల ఆకలి తీర్చాలని సంకల్పించి భవన నిర్మాణాలు చేపట్టారు. భవన నిర్మాణం పూర్తి అవుతున్న దశలో 2019లో సార్వత్రిక ఎన్నికలు రావడం, వైసీపీ ప్రభుత్వం అధికారం చేపట్టడం ఐదేళ్లుగా ఆ ప్రభుత్వం పట్టించుకోకపోవడం గాలికి వదిలేసింది. టీడీపీ అధికారంలోకి రావడం అన్నక్యాంటీన్ల పునరుద్దరణపై ముఖ్యమంత్రి సంతకం చేయడం పేదల ఆకలి తీరేందుకు తక్కువ ధరకే ఆహారం దొరకుతుందని, వ్యవసాయ కూలీలు, పెదలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా అంగన్‌వాడీ పిలుస్తోంది..


గ్రాడ్యుయేషన్ డేలో పాల్గొన్న చిన్నారులు

తాడిపత్రిటౌన్, జూన్ 14: పట్టణంలోని ఆసుపత్రిపాలెం, నందలపాడు-1 అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం అంగన్‌వాడీ పిలుస్తోంది, గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవి మాట్లాడుతూ చిన్నారులు అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించడం వల్ల వారి ఎదుగుదల త్వరగా జరుగుతుందన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు శంకరమ్మ, అనిత, లక్ష్మీకాంత పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గుత్తి, జూన్ 14: పట్టణంలోని 220కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా శనివారం గుత్తి, పెద్దవడుగూరు మండలాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో డీఈ సాయిశంకర్ తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు, ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

ఉరవకొండ: గుత్తి, గుంతకల్లు ఫీడర్‌లో మరమ్మతు కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈ రవిచంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి 1గంట వరకూ ఉరవకొండ, విడపనకల్లు, కణేకల్లు మండలాల్లో సరఫరా ఉండదన్నారు.

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుపై సంబరాలు

కళ్యాణదుర్గం, జూన్ 14: వైసీపీ ప్రభుత్వం అధికారంలో వున్నప్పుడు తీసుకువచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రద్దు చేయడంతో పట్టణంలో న్యాయవాదులు సంబరాలు చేసుకున్నారు. శుక్రవారం కోర్టు ఆవరణలో వారు కేక్ కట్‌చేసి స్వీట్లు పంచిపెట్టారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌తో పేద ప్రజలు ఎంతో ఉపశమనం పొందారన్నారు. సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన మొదటి రోజే చంద్రబాబునాయుడు ఈ యాక్ట్ రద్దుపై రెండో సంతకం చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. న్యాయవాదులు, బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

రాయదుర్గం: ప్రభుత్వం ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడం పట్ల లాయర్లు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం టీడీపీ కార్యాలయంలో న్యాయవాదులు లోకానంద, నాగరాజు, హరికృష్ణ, జాన్సన్‌ల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.


రాయదుర్గంలో కేక్ కట్ చేస్తున్న న్యాయవాదులు

బొమ్మనహాళ్: జగన్ ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ చట్టాన్ని సీఎం చంద్రబాబునాయుడు రద్దు చేయడం హర్షణీయమని తెలుగురైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేశవరెడ్డి, నియోజకవర్గ అధ్యక్షుడు యర్రగుంట్ల వెంకటేశులు, జిల్లా అధికార ప్రతినిధి ఎస్‌పీ నాగరాజు అన్నారు. శుక్రవారం వారు టీడీపీనాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడుతూ రైతులకు ఇబ్బంది కలిగించే చట్టాన్ని తీసుకొచ్చి జగన్ అన్నదాతలను నట్టేట ముంచేశాడనన్నారు. మండల కన్వీనర్ బలరాంరెడ్డి, సింగల్ విండో మాజీ అధ్యక్షుడు కొత్తపల్లి మల్లికార్జున, అప్పారావు, మహేంద్ర, పయ్యావుల అనిల్, పయ్యావుల మోహన్, పయ్యావుల నాగరాజు, నవీన్, సైకిల్‌షాప్ హనుమంతు, క్లస్టర్ కన్వీనర్ మాలపాటి ధనుంజయ, మాజీ సర్పంచ్ కేశప్ప పాల్గొన్నారు.

తాడిపత్రిటౌన్: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దుచేయడం హర్షణీయమని ఏపీ రైతు సంఘం మండల కమిటీ అధ్యక్షుడు సూర్యనారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజారామిరెడ్డి ఒక ప్రకటనలో అన్నారు. గత ప్రభుత్వం తెచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ వల్ల రైతుల్లో తీవ్రమైన భయాందోళనలు నెలకొని ఉండేవన్నారు. ఎన్నికల్లో కూటమి గెలవడం టైటిలింగ్ యాక్ట్‌ను రద్దుచేస్తూ ఐదు సంతకాల్లో ఒకటి కావడం ప్రజలకు సంతోషాన్ని ఇచ్చిందని వారు తెలిపారు.


గుంతకల్లులో మాట్లాడుతున్న న్యాయవాదులు


కళ్యాణదుర్గంలో సంబరాలు చేసుకుంటున్న న్యాయవాదులు

గుంతకల్లుటౌన్: ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు సంతకం చేసిన సందర్భంగా పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో బార్ అసోసియేషన్ కార్యాలయంలో శుక్రవారం టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి బీఎస్ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. కేక్‌ను కట్ చేసి స్వీట్లు పంచారు. న్యాయవాదులు మాట్లాడుతూ గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ చట్టాన్ని రాష్ట్ర వ్యాప్తంగా న్యాయవాదులు మూడు నెలలు ఉద్యమం చేపట్టారన్నారు. చంద్రబాబు ప్రభుత్వం ఏర్పడగానే రెండవ సంతకం చేసి ల్యాండ్ చట్టాన్ని రద్దుచేస్తానని మాట ఇచ్చారన్నారు. న్యాయవాదులు భాస్కర్‌గౌడ్, వెంకట్‌నాయుడు, నాగేషు, బడేసాబ్, లక్ష్మీనారాయణ, విద్యాసాగర్, హేమాద్రి, చెన్నకేశవులు, ధనుంజయ, పత్తికొండనాగరాజు, రవీంద్రకుమార్ పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న మంత్రి కేశవ్


మంత్రికి అమ్మవారి చిత్రపటాన్ని అందజేస్తున్న అధికారులు

ఉరవకొండ, జూన్ 14: విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై వెలిసిన దుర్గమ్మను ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చకులు మంత్రికి స్వాగతం పలికారు. అనంతరం ఆయన పేరిట అర్చకులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. స్వామివారి చిత్రపటాన్ని, తీర్థప్రసాదాలను అందజేశారు.

దివ్యాంగుల పింఛన్ పెంపు హర్షణీయం

కణేకల్లు, జూన్ 14: టీడీపీ ప్రభుత్వం దివ్యాంగుల పట్ల సానుకూల దృక్పథంతో పింఛన్‌ను రూ.3 వేల నుంచి 6 వేలకు పెంచడం హర్షణీయమని జాతీయ వికలాంగుల వేదిక జిల్లా అధ్యక్షుడు వసంత్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గత ప్రభుత్వం దివ్యాంగులను విస్మరిస్తే ఈ ప్రభుత్వం తమ పట్ల ఎంతో ప్రేమతో పింఛన్‌ను రెండింతలు చేయడం శుభపరిణామమన్నారు. గత ప్రభుత్వం 2022 ఆగస్టు నెలలో పలు కారణాలతో రాష్ట్రవ్యాప్తంగా 95 వేల మంది దివ్యాంగుల పింఛన్లను తొలగించిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం వాటిని పునరుద్ధరించి ఆదుకోవాలని ఆయన కోరారు.

రైతాంగ సమస్యలపై దృష్టి సారించాలి


మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా వర్కింగ్ అధ్యక్షుడు గోవిందు

గుంతకల్లుటౌన్, జూన్ 14: రైతాంగ సమస్యలపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వం దృష్టి సారించాలని రైతు సంఘం జిల్లా వర్కింగ్ అధ్యక్షుడు గోవిందు, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి కోరారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ రైతులకు, స్థిరాస్తి యజమానులపై ఉరితాడు లాంటి ల్యాండ్ టైటల్ యాక్టు రద్దు, మెగా డీఎస్సీ, పెదలకు పింఛను పెంపుపై చంద్రబాబు తొలి సంతకం చేయడం హర్షణీయమన్నారు. సీపీఐ మండల కార్యదర్శి రాము, గౌస్, దేవేంద్ర, ఉమర్‌బాషా, తలారిసురేష్, ఈశ్వరయ్య, పీసీ కుళ్లాయప్ప పాల్గొన్నారు.

ఆలయంలో టీడీపీ నాయకుల పూజలు

కుందుర్పి, జూన్ 14: కూటమి ప్రభుత్వం ఏర్పాటైన సందర్భంగా టీడీపీ నాయకులు శుక్రవారం కరిగానపల్లిలోని అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. రాష్ట్రంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా కళ్యాణదుర్గం నియోజకవర్గంలో అమిలినేని సురేంద్రబాబు అత్యధిక మెజార్టీతో గెలవడంతో 101 కొబ్బరికాయలను కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు.

సర్పంచ్ దంపతులపై కేసు నమోదు

ఉరవకొండ, జూన్ 14: మేజర్ పంచాయతీ సర్పంచ్ లలితమ్మ, ఆమె భర్త బసవరాజుపై కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ సురేష్ బాబు తెలిపారు. దౌర్జన్యంగా తమ ఇంటిని ధ్వంసం చేశారని రేణుక అనే మహిళ 2023 మేలో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

కర్నూలు జిల్లావాసిపై దాడి

గుంతకల్లుటౌన్, జూన్ 14: పట్టణంలోని సాయికృష్ణ నర్సింగ్ హోం వద్ద కర్నూలు జిల్లా చిప్పగిరి మండలం దౌల్తాపురం గ్రామానికి చెందిన శేకన్నపై శుక్రవారం గురుతెలియని వ్యక్తులు కట్టెలతో దాడి చేశారు. బాధితుడు, పోలీసులు తెలిపిన మేరకు పట్టణంలో శేకన్న చిన్న చిన్న పనులు చేసుకుని సా యికృష్ణనర్సింగ్ హోం వద్ద ఒక గదిని అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. సా యంత్రం ఐదుగురు గుర్తుతెలియని వ్యక్తులు ముసుగులు ధరించి శేకన్నపై కట్టెలతో దాడి చేశారు. గాయపడిన అతన్ని స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దాడి ఘటనపై విచారణ చేస్తున్నట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

తాడిపత్రిటౌన్, జూన్14: పట్టణంలోని శ్రీనివాసపురంలో శుక్రవారం అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్‌చేశామని పట్టణ పోలీసులు తెలిపారు. స్థానిక పెన్నానది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారంతో దాడులు నిర్వహించి ట్రాక్టర్ సీజ్‌చేసి డ్రైవర్‌పై కేసు నమోదు చేశామన్నారు.

పుట్లూరు: మండలంలోని ఏ. కొండాపురం గ్రామశివారులో అక్రమంగా త రలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను శుక్రవారం సీజ్‌చేసినట్లు పోలీసులు తెలిపారు. పె ద్దవప్పూరు మండలానికి చెందిన నాగేంద్ర ట్రాక్టర్‌లో ఇసుకను పుట్లూరుకు త రలిస్తుండగా తనిఖీ చేయగా ఎలాంటి రికార్డులు లేకపోవడంతో సీజ్ చేశామన్నారు. ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకొని కేసు నమోదుచేశామని ఎస్ఐ తెలిపారు.

కేసు నమోదు

పుట్లూరు, జూన్14: మండలంలోని కడవకల్లు గ్రామానికి చెందిన మిద్దెల చిన్న సిద్ధయ్య అనే వ్యక్తిపై అదే గ్రామానికి చెందిన మహిళలపై అసభ్యంగా ప్రవర్తించాడనే ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసినట్లు శుక్రవారం పోలీసులు తెలిపారు. గ్రామంలో ఇష్టానుసారంగా మాట్లాడినట్లు తెలిపారు. జయలలిత ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ హేమాద్రి తెలిపారు.

8 టిప్పర్లు సీజ్


సీజ్‌చేసిన టిప్పర్లు

తాడిపత్రిటౌన్, జూన్ 14: వైసీపీ మద్దతుదారులకు చెందిన 8 టిప్పర్లను శుక్రవారం సీజ్‌చేశామని ఆర్టీఏ అధికారులు తెలిపారు. రెండురోజుల నుంచి మండలంలోని అర్జాస్ స్టీల్ పరిశ్రమలో జరుపుతున్న దాడుల్లో సరైన రికార్డులు లేకపోవడంతో 8 టిప్పర్లను సీజ్ చేశామన్నారు. టిప్పర్లు నాగార్జున కన్‌స్ట్రక్షన్, పోస్ట్‌ప్రీ ఇన్‌ఫ్రాస్టక్చర్ లిమిటెడ్ పేరుతో ఉన్నాయన్నారు. ఈ వాహనాలు మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అనుచరులైన నరసింహారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, శేఖర్‌రెడ్డిలకు చెందినవని విశ్వసనీయ సమాచారం.

ఖరీఫ్ సాగుకు అన్నదాత సిద్ధం


పొలాలను సిద్ధం చేస్తున్న రైతు

కూడేరు, జూన్ 14: ఖరీఫ్ సీజన్‌లో వివిధ పంటలను సాగు చేసేందుకు అన్నదాతలు పొలాలను సిద్ధం చేస్తున్నారు. సకాలంలో వర్షాలు కురవడంతో అన్నదాతలు పొలాల్లో బిజీబిజీగా గడుపుతున్నారు. మండల వ్యాప్తంగా 30 ఎకరాల్లో పంటల సాగుకు భూముల్లో సేద్యాలు ప్రారంభించారు. ప్రధాన పంటలైన వేరుశనగ, కంది, ఆముదం పంటలతోపాటు అంతర పంటలు సాగుచేస్తున్నారు. ఈ ఏడాది సకాలంలో వర్షాలు కురుస్తుండటంతో అన్నదాతలు వేరుశనగ పంటను సాగు చేయడానికి మొగ్గు చూపుతున్నారు.

కమిటీ ఏర్పాటు

డీ.హీరేహాళ్, జూన్ 14: మండల వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. మండల కేంద్రంలోని పాఠశాలలో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సంఘం గౌరవాధ్యక్షుడిగా హనుమంతప్ప, మండల అధ్యక్షుడిగా లక్క శ్రీనాథ్, సహాధ్యక్షులుగా బజవరాజు, ఉపాధ్యక్షులుగా శశిధర్, సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా అయ్యన్న, సహ ప్రధాన కార్యదర్శిగా అరుణకుమార్, కోశాధికారిగా యంబా కృష్ణ, జిల్లా కార్యదర్శులుగా బీ ఇరాలప్ప, జీ బసన్న, మండల కార్యదర్శిగా పీ దివాకర్, గంగాధర, హుసేనిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

గుంతకల్లుటౌన్, జూన్ 14: పట్టణంలోని స్కిల్ సెంటర్‌లో నేషనల్ అకాడమీ కన్‌స్ట్రక్షన్(న్యాక్)ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు అసిస్టెంట్ డైరెక్టర్ గోవిందరాజులు శుక్రవారం ఒక ప్రటనలో తెలిపారు. 16 నుంచి 35సంవత్సరాల యువతకు ల్యాండ్ సర్వేయర్, ఎలక్ట్రీషియన్‌లో రెండు నెలలు శిక్షణ ఇచ్చి ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం కల్పిస్తామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు 20వతేదీలోగా ఆధార్, రేషన్ కార్డ్ జిరాక్స్, అర్హత ధృవపత్రాలు, పాస్ ఫొటోలతో సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాలకు 7013858450 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

పాఠ్యపుస్తకాల పంపిణీ

కణేకల్లు, జూన్ 14: మండల వ్యాప్తంగా ఉన్న పాఠశాలలకు ప్రభుత్వం అందజేసిన పాఠ్యపుస్తకాలను శుక్రవారం పంపిణీ చేశారు. మండల విద్యాధికారులు లక్ష్మణ్ణ, భవానీశంకర్ ఆధ్వర్యంలో ఆయా పాఠశాలలకు సెమ్-1 కింద మంజూరైన పాఠ్యపుస్తకాలను అందజేశారు. ఎమ్మార్సీ సిబ్బంది రెహమాన్, రాజేష్, లక్ష్మీకాంత్, పెద్దన్న పాల్గొన్నారు.

విషజ్వరాల పట్ల జాగ్రత్త వహించండి

డీ.హీరేహాళ్, జూన్ 14: విషజ్వరాల పట్ల ప్రజ లు జాగ్రత్త వహించాలని ప్రభుత్వ వైద్యుడు శ్రవణ్‌కుమార్ సూచించారు. మండల వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండడంతో గ్రామాలలో నీటి నిల్వ ప్రదేశాలు అధికంగా ఉంటున్నాయన్నారు. గ్రామాల పర్యవేక్షణలో భాగంగా మండలంలోని మడేనహళ్లి, డీ.హీరేహాళ్, ఓబుళాపురం తదితర గ్రామాలలో పర్యటించినట్లు తెలిపారు. ఆయా గ్రామాలలోని హెల్త్ సెంటర్లలో అనారోగ్యంతో వచ్చిన వారికి చికిత్సను అందించారు. అనంతరం గ్రామాలలో నీటి నిల్వ ఉన్న ప్రాంతాల్లో వైద్యసిబ్బందితో కలిసి బ్లీచింగ్ చేయించారు.

ఎల్లుట్లకు బస్సు సర్వీసు పునరుద్ధరణ

పుట్లూరు, జూన్ 14: మండలంలోని ఎల్లుట్లకు శుక్రవారం నుంచి బస్సు సర్వీసు పునరుద్ధరించారు. అనంతపురం జిల్లా కేంద్రం నుంచి నార్పల, గూగూడు, ఎల్లుట్ల, జంగంరెడ్డిపేట గ్రామాలకు చేరుకుంటుంది. ఉదయం, సాయంత్రం రెండు సర్వీసులు తిరుగుతుందని ఆర్టీసీ అధికారులు తెలిపారు. 18 ఏళ్ల తర్వాత ఆర్టీసీ బస్సు వస్తుండడంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఆటోలు, ద్విచక్రవాహనాల్లో వెళ్లే వారమని ప్రస్తుతం ఇబ్బందులు తప్పాయని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అధిక ఫీజులను అరికట్టాలి

తాడిపత్రిటౌన్, జూన్ 14: పట్టణంలోని కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలు వసూలు చేసే అధిక ఫీజులను అరికట్టాలని ఏబీవీపీ నాయకులు హరినారాయణ, రాజు శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వేలకు వేలు ఫీజులు వసూలు చేస్తూ తల్లిదండ్రులను దోచుకుంటున్నారన్నారు. పుస్తకాలు, యూనిఫాం విక్రయిస్తూ విద్యను వ్యాపారకేంద్రంగా మార్చారని ఆరోపించారు. నిబంధనలను పాటించని పాఠశాలలపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

మెగా డీఎస్సీపై తొలి సంతకం హర్షణీయం

తాడిపత్రిటౌన్, జూన్ 14: ఎన్నికల్లో కూటమి ఇచ్చిన హామీ మేరకు మెగా డీఎస్సీపై తొలిసంతకం పెట్టడం హర్షణీయమని బీజేపీ జిల్లా గ్రంథాలయ కన్వీనర్ పోతుల గంగాధర్‌యాదవ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఐదేళ్ల నిరుద్యోగులు ఉద్యోగాలు లేక నరకయాతన అనుభవించారన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టడంతో ఉద్యోగాల జాతర మొదలైందని అన్నారు. ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి అనుమతి ఇవ్వడంతో నిరుద్యోగుల్లో ఆనందం వెల్లివిరిసిందని ఆయన తెలిపారు.

పిల్లలను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు

గుత్తి, జూన్ 14: పిల్లలను పనులకు పెట్టుకుంటే చట్టపరంగా చర్యలు తప్పవని బాలల పరిరక్షణ సమితి జిల్లా ప్రొటెక్షన్ అధికారి వెంకటేశ్వరి హెచ్చరించారు. పట్టణంలో శుక్రవారం గాంధీ సర్కిల్, గుంతకల్లు రోడ్డు, తదితర ప్రాంతాలలో చైల్డ్ లేబర్ రెస్క్యూ టీం దాడులు నిర్వహించారు. కిరాణ, బట్టలు, మెకానిక్ దుకాణాలలో పనిచేస్తున్న ముగ్గురు పిల్లలను గుర్తించామన్నారు. వారిని వీడియో కాల్ ద్వారా చైల్డ్ వెల్ఫేర్ జిల్లా కమిటీ ఎదుట హాజరు పరచామన్నారు. సిబ్బంది రవీంద్ర, ప్రతాప్‌నాయుడు, రైట్స్ ఎన్జీఓ జయమ్మ, సురేఖ పాల్గొన్నారు.

దేవాలయ భూముల వేలం

ఉరవకొండ, జూన్ 14: మండలంలోని బూదగవి గ్రామంలో ఆంజనేయస్వామి దేవాలయానికి సంబంధించిన భూములకు శుక్రవారం వేలం పాట నిర్వహించారు. స్థానిక ఆలయంలో దేవదాయశాఖ అధికారులు రమేష్‌బాబు, కృష్ణయ్య, ఆధ్వర్యంలో వేలం పాట చేపట్టారు. 44.29 ఎకరాల భూములకు వేలం నిర్వహించగా, రూ.2.92 లక్షల ఆదాయం వచ్చినట్లు గ్రూప్ టెంపుల్ అధికారి కృష్ణయ్య తెలిపారు.

విజయోత్సవ ర్యాలీని జయప్రదం చేయండి

బొమ్మనహాళ్, జూన్ 14: సార్వత్రిక ఎన్నికల్లో అఖండ మెజార్టీతో రాయదుర్గం ఎమ్మెల్యేగా గెలుపొందిన కాలవ శ్రీనివాసులు విజయోత్సవ ర్యాలీని జయప్రదం చేయాలని టీడీపీ మండల కన్వీనర్ బలరాంరెడ్డి కోరారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యేగా గెలుపొందిన తర్వాత మొట్టమొదటి సారిగా శనివారం రాయదుర్గం నియోజకవర్గానికి వస్తున్న నేపథ్యంలో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 10.30 గంటలకు పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథిగృహం వద్ద నుంచి ఎన్టీఆర్ విగ్రహం వరకు ఊరేగింపు ఉంటుందన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రాయదుర్గంరూరల్: శాసనసభ్యుడి ఎన్నికై తొలిసారిగా కాలవ శ్రీనివాసులు రాయదుర్గానికి విచ్చేస్తున్న సందర్భంగా విజయోత్సవ ర్యాలీని నిర్వహిస్తున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు కాలవ శ్రీనివాసులును భారీ మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలిపించడంతో ఘనంగా స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో తరలి రావాలని ఆయన పిలుపునిచ్చారు.


మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

రక్తదానం.. ప్రాణదానంతో సమానం


ఉద్దేహాళ్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, వైద్యసిబ్బంది

బొమ్మనహాళ్, జూన్ 14: రక్తదానం ప్రాణదానంతో సమానమని ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండలంలోని ఉద్దేహాళ్ గ్రామంలో రక్తదానంపై అవగాహన కల్పిస్తూ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ప్రతిఒక్కరికి అవగాహన కల్పించి స్వచ్ఛందంగా రక్తదానం చేయడంతో అత్యవసర పరిస్థితుల్లో ఉన్న రోగికి ఈ రక్తం ప్రాణదానంతో సమానమని తెలిపారు. ఒకరి జీవితాన్ని కాపాడిన వారు అవుతామని పేర్కొన్నారు. ఈ విషయాన్ని అందరికీ అవగాహన కల్పించి స్వచ్ఛందంగా రక్తదానం ఇవ్వాలని కోరారు. సీహెచ్‌ఓ నాగమణి, హెల్త్ అసిస్టెంట్లు జైనాబీ, గోవర్ధన్, ఉపాధ్యాయుడు నాగభూషణం పాల్గొన్నారు.

గుంతకల్లుటౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్రవారం జేవీవీ ఆధ్వర్యంలో ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జయవర్ధన్‌రెడ్డి, పోలేరమ్మ ఆలయ కమిటీ ధర్మకర్త దొడ్డప్ప కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారికి రక్తదానం చేసి ప్రాణాలు కాపుడుతున్న రక్తదాతల సేవలు మరవలేనివన్నారు. అనంతరం పలువురు రక్తదానం చేశారు. జేవీవీ వ్యవస్థాపక అధ్యక్షుడు గంగరాజు, రాష్ట్ర కార్యదర్శి హరిప్రసాద్‌యాదవ్, ప్రభుత్వ ఆసుపత్రి ఏఓ రాంప్రసాద్‌రావు, ల్యాబ్ టెక్నీషియన్లు సత్య, రాజు పాల్గొన్నారు.


గుంతకల్లులో రక్తదానం చేస్తున్న దాతులు